జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967



కృష్ణ | శనివారం 22 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :219 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత

- కుల ఆధారిత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా భారీ నిరసనలు
- రంగంలోకి పోలీసులు, కేంద్ర బలగాలు!
- దిల్లీ జంతర్ మంతర్ వద్ద పోటెత్తిన ఆందోళనకారులు
- కుల ప్రాతిపదికన రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసనలు
- ముందస్తు చర్యగా పోలీసు, పారమిలిటరీ దళాల భారీ మోహరింపు

# ఏపీ మున్సిపాలిటీల సమూల ప్రక్షాళన



- రూ.40 వేల కోట్లతో బృహత్తర ప్రణాళిక
- 123 పట్టణ స్థానిక సంస్థల్లో రూ.40,743 కోట్లతో భారీ ప్రాజెక్టులు
- రోడ్లు, డ్రైనేజీల కోసం రూ.7,469 కోట్లకు పరిపాలనా అనుమతులు
- పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు

**అమరావతి**

రాష్ట్రంలోని మున్సిపాలిటీల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు ప్రభుత్వం బృహత్తర ప్రణాళికలు సిద్ధం చేసింది. స్వర్ణాంధ్ర-2047కు అనుగుణంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఏకంగా రూ.40,743 కోట్ల అంచనాతో భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, వీధిదీపాల ఏర్పాటు కోసం రూ.7,469.46 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పురపాలక శాఖ తాజాగా - మిగతా3లో



## ఉనికి కోసమే జగన్ ఆరాటం !

- గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీ, వార్డులో తప్పనిసరిగా నామినేషన్లు వేసి తీరాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశిస్తున్న తీరు.. పార్టీ బలమైన స్థితిలో ఉండి ఇచ్చే పిలుపులా కాకుండా, కనీస రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న తాపత్రయంలా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.
- ఒకవేళ స్థానిక ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నిలబడకపోతే, క్షేత్రస్థాయిలో కేడర్ పూర్తిగా నిర్లిప్తతలోకి జారిపోయిందన్న స్పష్టమైన సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది.
- అసెంబ్లీలో 11 సీట్లకు పరిమితమైన తర్వాత, పార్టీ ఇంకా సజీవంగానే ఉందని నిరూపించుకోవడానికి చేపట్టే పర్యటనలు, రోడ్‌షోలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు అన్నీ ఒక్కసారిగా తేలిపోతాయి

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న వరుస నియోజకవర్గాల సమీక్షా సమావేశాల్లో కేడర్‌నుద్దేశించి ఆయన చేస్తున్న ప్రసంగాలు - మిగతా3లో



## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..

- కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష
- జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై నడ్డా సమీక్ష
- నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలను సమీక్షించిన నడ్డా
- వ్యాధి లక్షణాలున్నవారిని ముందస్తుగా గుర్తించడం కీలకమన్న కేంద్ర మంత్రి

## యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు

- అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు భారత్‌ను ప్రపంచ కేంద్రంగా మార్చాలి
- దేశ అంతరిక్ష రంగం గురించి కీలక వ్యాఖ్యలు చేసిన నరేంద్ర మోదీ
- వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్టార్టప్‌లను కోరిన ప్రధాని
- కొన్ని దేశాలు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టట్లేదు : మోదీ



## ఈ నెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులు

- మంత్రి నారాయణ
- ఈ ఆలయం నుంచి రైతులు ప్రారంభించిన పాదయాత్ర విజయవంతంగా జరిగింది
- రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ నిర్మాణంపై దృష్టి సారించాం
- ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటాం



**అమరావతి**

రాజధానిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులను ఈనెల 29 నుంచి ప్రారంభిస్తామని మంత్రి నారాయణ చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి, శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... ఈ ఆలయం నుంచి రైతులు ప్రారంభించిన పాదయాత్ర - మిగతా3లో



## పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ మెరుపు ధర్నా

- వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్
- ఈ నెల 17న మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదన్న రాహుల్
- ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు తాను ఇక్కడి నుంచి కదిలేది లేదని వెల్లడి

## ఎంపీ అవినాష్‌రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు

- రూ.24 లక్షల నగదు సీజ్
- వివేక హత్యకు ముందు చేతులు మారిన రూ.40 కోట్లు
- గంగిరెడ్డి ద్వారా రూ.5 కోట్లు ఇచ్చేలా ఒప్పందం జరిగిందన్న దస్తగిరి
- సునీల్ యాదవ్ నుంచి రూ.కోటి అందినట్లు విచారణలో వెల్లడి



**అమరావతి**

వివేకా హత్య కేసులో ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి పెట్టింది. నిందితుల ఇళ్లలో ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించింది. ఎంపీ అవినాశ్‌రెడ్డి నివాసాల్లో లెక్కల్లో చూపని 24 లక్షల రూపాయలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు రెండు లాకర్ల తాళాలు, కీలక దస్త్రాలను తీసుకెళ్లారు. ఏకకాలంలో సోదాలు: వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. హత్యకు ముందు రూ. 40 కోట్లు చేతులు మారినట్లు సీబీఐ విచారణలో తేలింది. గంగిరెడ్డి ద్వారా తనకు రూ. 5 కోట్లు ఇచ్చేలా ఒప్పందం జరిగిందని దస్తగిరి చెప్పినట్లు తెలిసింది. సునీల్ యాదవ్ నుంచి అందిన కోటి రూపాయల్లో, 75 లక్షలు తన మిత్రుడు సయ్యద్ మున్నా వద్ద ఉంచినట్లు సీబీఐ విచారణలో అంగీకరించారు. సయ్యద్ మున్నా లాకర్ల నుంచి సీబీఐ అధికారులు రూ. 46.7 లక్షల నగదు, లెక్కల్లో లేని ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. - మిగతా3లో

# యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు

అంతరిక్ష రంగంలో ప్రపంచ ప్రతిభకు, కంపెనీలకు, పెట్టుబడులకు భారత్ ఒక ఆకర్షణ కేంద్రంగా మారగలదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌లను కోరారు. అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు దేశాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చాలని అన్నారు. శుక్రవారం నాడు సేవా తీర్థ్ (పీఎం కార్యాలయం)లో 20 స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ మేరకు భారత అంతరిక్ష రంగం గురించి మోదీ వ్యాఖ్యానించారు. యువ అంతరిక్ష పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. వ్యవసాయం, పశు సంపద నిర్వహణ, పాడి, పర్యావరణం, ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే ఇతర రంగాలలో అంతరిక్ష సాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చో అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులను కోరారు. స్పేస్ స్టార్టప్‌ల వంటి కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి రిస్క్‌లు తీసుకున్నందుకు వారిని ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని విస్తరించడానికి అంతరిక్ష సంస్థలు, ఇతర రంగాల సంస్థల మధ్య మరింత సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. "ప్రపంచం అంతరిక్షం గురించి ఆలోచించినప్పుడు భారత్ వైపు చూసే ఒక ఎకో సిస్టమ్‌ను సృష్టించాలి. ప్రపంచవ్యాప్త ప్రతిభను, కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షించడానికి దేశ అంతరిక్ష రంగం ఒక అయస్కాంతంలా పనిచేయగలదు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించడం పట్ల ప్రభుత్వానికి దార్శనికత ఉంది. ఒక కొత్త రంగాన్ని ముందుండి నడిపించినందుకు స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, ఫౌండర్స్‌కు అభినందనలు. అనేక దేశాలు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టలేకపోతున్నాయి. కొన్ని దేశాలు ఇన్వెస్ట్ చేయడానికి ఇష్టపడటం లేదు. ఇది ప్రపంచ అంతరిక్ష రంగంలో భారతదేశానికి తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పిస్తోంది. చిన్న వయసు నుంచే పిల్లలలో అంతరిక్షం పట్ల జిజ్ఞాస, ఆసక్తిని



పెంపొందించడానికి అంతరిక్ష సంస్థలు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మధ్య మరింత సన్నిహిత సహకారం ఉండాలి. " భారత అంతరిక్ష రంగ యువ కెరటాలను కలవడం అద్భుతంగా ఉందన్నారు మోదీ. "ఒక కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించిన యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు వీరు. వారు రిస్కులు తీసుకున్నారు, సంస్కరణల ప్రక్రియను విశ్వసించారు. తమ ప్రయత్నాలలో నిలకడగా ఉన్నారు. దీని కారణంగా గత కొన్నేళ్లుగా అంతరిక్ష రంగంలో భారత్ ఎంతో సాధించింది. స్టార్టప్‌లు తమ పనిపై విశ్లేషణాత్మక ప్రజెంటేషన్లు ఇచ్చాయి. భవిష్యత్ కోసం దేశ సామర్థ్యాలను నిర్మించే క్రమంలో భారత ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని స్పేస్ స్టార్టప్‌లకు హామీ ఇచ్చాను. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచానికి ఒక బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా లాభదాయకమైన నమూనాను అందించగలదు" అని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో దిగిన ఫొటోను మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**సీఈఓలు, ఫౌండర్స్ ఏమన్నారంటే?**

భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ వేగంగా సాధిస్తున్న ప్రగతిని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులు మోదీ వద్ద ప్రముఖంగా ప్రస్తావించారు. దేశ అంతరిక్ష రంగం అభివృద్ధి చేసిన సాంకేతికతలను స్వీకరించడానికి, వినియోగించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయని వారు అభిప్రాయపడ్డారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించడం ఈ పరిశ్రమకు కొత్త అవకాశాలను సృష్టించిందని పేర్కొన్నారు. ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమకు ప్రభుత్వం నుంచి లభించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేశారు.
స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, పిక్సెల్, ధ్రువ స్పేస్, గెలాక్స్ఐ, పియర్‌సైట్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, దిగంతర, సాట్‌స్యూర్, సుహోరా టెక్నాలజీస్, మనస్తు స్పేస్, ఆస్ట్రోబేస్, టేక్‌మీ2స్పేస్, వ్యోమిక్, కాస్మోసర్వ్ స్పేస్, ఆర్బిట్‌ఎయిడ్ ఏరోస్పేస్, స్కైసర్వ్, సెరెండిపిటీ స్పేస్, వాసర్ ల్యాబ్స్, మిస్ట్‌ఈఓ సంస్థల సీఈఓలు, వ్యవస్థాపకులు ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వారితో దేశ అంతరిక్ష రంగం గురించి మోదీ సంభాషించారు.

# జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరోసారి తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రస్తుత కుల ఆధారిత రిజర్వేషన్ల విధానానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో ప్రజలు, యువకులు జంతర్ మంతర్ వద్దకు చేరుకొని నిరసనలు తెలిపారు. రిజర్వేషన్ వ్యవస్థను సమీక్షించాలని, రిజర్వేషన్లలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆందోళన కార్యక్రమానికి ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని పోలీసులు స్పష్టం చేసినప్పటికీ, పెద్ద ఎత్తున నిరసనకారులు భారీగా తరలివచ్చారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, శాంతి భద్రతల్ని కాపాడేందుకు ఢిల్లీ పోలీసులు, కేంద్ర పారామిలిటరీ బలగాలు నిరసన ప్రాంతానికి చేరుకొని భద్రతను పర్యవేక్షించాయి. ఈ నిరసన కార్యక్రమానికి అనుమతి నిరాకరిస్తూ ఢిల్లీ పోలీసులు గురువారమే ప్రకటన విడుదల చేశారు. అయినప్పటికీ శుక్రవారం ఉదయం నుంచే చిన్న చిన్న గుంపులుగా ప్రజలు జంతర్ మంతర్ వద్దకు చేరుకోవడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే పరిస్థితి చేయిదాటిపోకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు జంతర్ మంతర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విస్తృత ప్రచారం జరగడం వల్లే నిరసనకారులు పెద్ద ఎత్తున తరలి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 5.6 మిలియన్ల ఫాలోవర్లు ఉన్న ఒక సంస్థకు చెందిన అధికారిక పేజీ ఇన్‌స్టాగ్రామ్‌లో గురువారం రోజు ఒక పోస్టర్‌ను పంచుకుంది. ఆగస్ట్ 21న మధ్యాహ్నం 2 గంటలకు జంతర్ మంతర్ వద్ద జరిగే శాంతియుత నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చింది. 'రిజర్వేషన్ హఠావో ఆందోళన్' (=వంవతీజ్ఖఅశీఅ ఏ్ఖశీ చాఅంశీశ్రీఖఅ) అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ఈ నిరసనకు పిలుపునిచ్చినట్లు తెలిసింది. ఈ పోస్ట్ బాగా వైరల్ కావడంతో ఉదయం నుంచే జనం గుంపులు గుంపులుగా జంతర్ మంతర్ దగ్గరికి రావడం ప్రారంభించారు. ఇటీవల 'కాక్రోచ్ జనతా పార్టీ' నిరసన విధానాల్ని అనుసరిస్తూనే ఈ వేదిక కూడా వేగంగా ప్రసిద్ధి చెందింది. ఈ పేజీ ద్వారానే రిజర్వేషన్ వ్యవస్థకు వ్యతిరేకంగా నిరసనలకు పిలుపునివ్వడంతో, పోలీసులు అప్రమత్తమై జంతర్ మంతర్ వద్ద భద్రతను



పటిష్టం చేశారు.

**సోషల్ మీడియా ప్రచారంపై పోలీసుల తీవ్ర హెచ్చరికలు**

ఆగస్ట్ 21న జంతర్ మంతర్ వద్ద రిజర్వేషన్ల సంస్కరణలపై నిరసన తెలిపేందుకు అనుమతి లభించిందంటూ సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న వార్తలు, వీడియోలు అబద్ధమని, తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ఢిల్లీ జిల్లా పరిధిలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని (దీచీూ) సెక్షన్ 163 (గతంలో సెక్షన్ 144 జతీూజ) ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం, నిరసన ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించడాన్ని పూర్తిగా నిషేధించారు. ఇదే సమయంలో ఫేక్ న్యూస్‌ను, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడం, ప్రచారం చేయడం లేదా నమ్మడం చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫేక్ న్యూస్ సృష్టించే వారిపై లేదా దాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నిరసనలకు కేంద్రంగా జంతర్ మంతర్!**

ఢిల్లీ జంతర్ మంతర్ ఇటీవల ఎక్కువగా వార్తల్లో నిలిచింది. నీట్- యూజీ పేపర్ లీకేజీ ఆరోపణలు, అవకతవకలకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) ఇక్కడే నిరసనల్ని ప్రారంభించింది. విద్యార్థుల పోరాటానికి లద్దాఖ్‌కు చెందిన ఇంజినీర్, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ జంతర్ మంతర్ వద్ద జూన్ 28న ఆమరణ నిరాహార దీక్ష కూడా చేపట్టారు. అక్కడి నుంచే జులై 20న చేపట్టిన పార్లమెంట్ మార్చ్ ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రభుత్వం ఆ తర్వాత లిఖితపూర్వక హామీలివ్వడంతో జులై 23న వాంగ్‌చుక్ దీక్ష విరమించారు. తర్వాత జులై 25న ధర్మంద్ర ప్రధాన్ కూడా రాజీనామా చేశారు. ఆ తర్వాతే జంతర్ మంతర్ వద్ద చాలా రోజుల తర్వాత జనసందోహం తగ్గింది. మళ్లీ ఇప్పుడు అక్కడికి భారీగా ప్రజలు తరలిరావడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి.

# సిద్ధాంతాల ఆధారంగానే పదవులు

**న్యూఢిల్లీ :** భారత రాజకీయాల్లో వారసత్వం, కుటుంబ నేపథ్యం అనేది నాయకత్వ అర్హతగా మారిన తరుణంలో, భారతీయ జనతా పార్టీ మాత్రం కింది స్థాయి కార్యకర్త నుంచి అగ్ర నాయకుడిగా ఎదిగే సిద్ధాంతానికే మొగ్గు చూపుతోంది. ఇటీవల ప్రకటించిన పార్టీ కొత్త జాతీయ కార్యవర్గంలో సైతం ఈ తరహా క్యాడర్-బేస్డ్ లీడర్‌షిప్‌కే అధిష్ఠానం పెద్దపీట వేసింది. కేవలం ఒక పొలిటికల్ ప్యాషన్ , క్రమశిక్షణ, భావజాలం పట్ల అంకితభావంతో పనిచేసే సాధారణ కార్యకర్తకు కూడా నంబర్-1 స్థానాన్ని అధిష్టించే అవకాశం కల్పించడమే తమ శ్రేణుల బలం అని బీజేపీ మరోసారి రుజువు చేసింది. ఈ గ్రాస్‌రూట్ మోడల్ కు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే అతిపెద్ద ఉదాహరణ. గుజరాత్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా, సాదాసీదా కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎదిగిన విధానం బీజేపీ సిద్ధాంతానికి నిలువెత్తు సాక్ష్యం. తాజాగా పార్టీ అత్యున్నత అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన నితిన్ నబీన్ ప్రయాణం కూడా ఇందుకు భిన్నమైనది కాదు. యువజన మోర్చా స్థాయి నుంచి సుదీర్ఘకాలం పాటు క్షేత్రస్థాయిలో చెమటోడ్చి, కష్టపడి పనిచేసిన నైపుణ్యాన్ని గుర్తించే పార్టీ జాతీయ నాయకత్వ పగ్గాలను ఆయనకు అప్పగించింది. కొత్త జాతీయ కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎంపికైన రామ్ మాధవ్ , ఆల్ సెల్స్ కో కన్వీనర్‌గా స్థానం పొందిన విష్ణువర్ధన్ రెడ్డి వంటి నేతల ప్రయాణం ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీల పునాదుల మీదే సాగింది. రామ్ మాధవ్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో క్షేత్రస్థాయి స్వయంసేవక్‌గా పొలిటికల్ డిప్లొమసీని, సిద్ధాంత పటిష్టతను నేర్చుకుని బీజేపీ జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారారు. అలాగే ఏపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థి విభాగమైన ఏబీవీపీ ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థాయికి చేరుకున్నారు. ఇవి కేవలం ఉద్యోగ బాధ్యతలు కావు, సిద్ధాంతం పట్ల ఉండే 'ప్యాషన్'. అధికార మార్పిడి , పదవుల పంపకంలో వారసత్వ రాజకీయాల ను పూర్తిగా పక్కనపెట్టడం బీజేపీకి సంస్థాగతంగా కొన్ని ప్రధాన ప్రయోజనాలను తెచ్చిపెడుతోంది. ఏ మూలన ఉన్న సాధారణ శ్రేణి నేతలకైనా, నేను కూడా రేపు జాతీయ స్థాయి నేతను కాగలను అనే ఆశ, ఉత్సాహం నిరంతరం పని చేసేలా ప్రేరేపిస్తాయి. పక్షపాతం లేకుండా పనితీరు, ఫలితాలే ప్రాతిపదికగా ప్రమోషన్లు ఇవ్వడం వల్ల పార్టీ నడిపించే వ్యూహకర్తలకు క్షేత్రస్థాయి సమర్థత దక్కుతుంది. ప్రత్యర్థి పార్టీలలో నడుస్తున్న కుటుంబ పాలన ను నిలదీసే నైతిక బలం ఒక్క బీజేపీకే సాధ్యమవుతుంది. ఈ గ్రాస్‌రూట్ నాయకత్వ నమూనాలో కొన్ని అంతర్గత సవాళ్లు కూడా లేకపోలేదు. క్షేత్రస్థాయి నుంచి కష్టపడి వచ్చిన నేతలకు సిద్ధాంతపరమైన నిబద్ధత ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో విభిన్న సామాజిక సమీకరణాలను, గ్లామరస్ పాపులిజమ్‌ను తట్టుకుని ఓట్లుగా మలచడం ఒక్కోసారి క్లిష్టంగా మారుతుంది. అంతేకాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చే మాస్ లీడర్లకు, కింది స్థాయి నుంచి ఎదిగిన ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న 'ఆర్గనైజేషనల్' నేతలకు మధ్య సమన్వయం కుదర్చడం జాతీయ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారుతుంటుంది.

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..



దేశంలో స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

## పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ మెరుపు ధర్నా




ఢిల్లీలోని పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థి సాహిల్ లోచబ్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన, విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదంటూ పోలీస్ స్టేషన్ వద్దే బైఠాయించారు. రాహుల్ గాంధీ నిరసనకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వెలుపల భారీగా బలగాలను మోహరించారు. పరిస్థితి అదుపు తప్పకుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని కూడా రంగంలోకి దించారు. గత నెల జులై 20న జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టిన సమయంలో పోలీసులు పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఘటనలో సాహిల్?కు పెల్లెట్లు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయని, ఒక కంటి చూపు ప్రమాదంలో పడిందని రాహుల్ పేర్కొన్నారు. గాయపడిన సాహిల్‌కు ఢిల్లీలోని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో శస్త్రచికిత్స జరిగినట్లు తెలిపారు. దాంతో సాహిల్ లోచబ్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదును తీసుకుని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఫిర్యాదుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఢిల్లీ స్థానిక డీసీపీతో కూడా ఆయన చర్చలు జరిపారు. అయినప్పటికీ కేసు నమోదు కాకపోవడంతో పోలీస్ స్టేషన్ వద్దే నిరసనకు దిగారు.
"జులై 20న, జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాహిల్‌పై పోలీసులు పెల్లెట్ గన్‌తో దాడి చేశారు. పెల్లెట్ల వల్ల తీవ్రంగా గాయపడిన సాహిల్ ఒక కంటి చూపు ఇప్పుడు ప్రమాదంలో ఉంది. శాంతియుత నిరసనపై ఇటువంటి క్రూరత్వం చట్టవిరుద్ధం మాత్రమే కాదు. ఇది ఒక తీవ్రమైన నేరం. ఈ దురాగతానికి హోం మంత్రి అమిత్ షా విద్యార్థులకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ప్రధానమంత్రి కూడా వారికి క్షమాపణ చెప్పలేదు." అలాగే ఇప్పుడు, సాహిల్ న్యాయం కోసం ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలనుకుంటే, దానికి కూడా అనుమతించడం లేదని రాహుల్? అన్నారు. ఈ విధంగా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. "అమిత్ షా, మీరు న్యాయానికి ఎందుకంత భయపడుతున్నారు ఈ భయం మీరు మీ నేరాన్ని అంగీకరిస్తున్నారని చూపిస్తోంది" అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. సాహిల్?కు, అతడి లాంటి ప్రతి విద్యార్థి బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన ఉద్ఘాటించారు.

**కాంగ్రెస్ నేతల మద్దతు**

రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన విషయం తెలియడంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు సీనియర్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రాహుల్‌కు మద్దతు తెలిపారు. పోలీసుల తీరుపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదుపై స్పష్టత వచ్చే వరకు తమ నిరసన కొనసాగుతుందని తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ, ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే వరకు రాహుల్ గాంధీ నిరసనలోనే కూర్చున్నారని, ఆయనకు మద్దతుగా తాము అక్కడికి వచ్చినట్లు చెప్పారు. ఈ పోరాటంలో రాహుల్ విజయం సాధిస్తారన్న నమ్మకం ఆయనకు ఉందన్నారు.

**'మీరు చట్టాన్నీ గౌరవించరా?'**

ఇదిలా ఉండగా, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, "రాహుల్ గాంధీ అరాచక రాజకీయాలు చేయడం చాలా దురదృష్టకరం. ప్రస్తుతం ఆయన ఎలాంటి అనుమతి, ముందస్తు సమాచారం లేకుండా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు కూర్చున్నారు. ఆయన ప్రస్తావిస్తున్న ఘటనపై ఇప్పటికే ఒక ఎఫ్ఐఆర్ నమోదైందని, దానిపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు ఆయనకు తెలియజేశారు. దీనిపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రాహుల్ గాంధీ, మీరు ఏ చట్టాన్నీ గౌరవించరా? జాతీయ గీతం వందేమాతరంపై కాంగ్రెస్ వైఖరి కారణంగానే ఇప్పుడు ఆ పార్టీ ఇరుక్కుపోయిందని మేము అనుమానిస్తున్నాం, ఆరోపిస్తున్నాం. రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ఇప్పుడు చేస్తున్న దానిని మేము ఖండిస్తున్నాం" అని అన్నారు.

**ఆగస్టు 14న ఫిర్యాదు**

కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, సాహిల్ లోచబ్ ఆగస్టు 14న తన న్యాయవాదులతో కలిసి ఢిల్లీ పోలీసులను ఆశ్రయించారు. పెల్లెట్ గన్ ఘటనపై లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. అయితే పోలీసులు ఐవో నంబర్ లేదా ఫిర్యాదు స్వీకరణకు సంబంధించిన రసీదు ఇవ్వలేదని పార్టీ వర్గాలు ఆరోపించాయి. ఆగస్టు 17న కూడా ఈ విషయంపై ఈమెయిల్, ఫోన్ ద్వారా పోలీసులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీంతో సాహిల్ రాహుల్ గాంధీ సహాయం కోరినట్లు పేర్కొన్నాయి. అనంతరం బాధితుడితో కలిసి రాహుల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేసినట్లు వెల్లడించాయి.

# ఉనికి' కోసమే జగన్ ఆరాటం !


-మొదటిపేజీ తరువాయి

దీనిని స్పష్టం చేస్తున్నాయి. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీ, వార్డులో తప్పనిసరిగా నామినేషన్లు వేసి తీరాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశిస్తున్న తీరు.. పార్టీ బలమైన స్థితిలో ఉండి ఇచ్చే పిలుపులా కాకుండా, కనీస రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న తాపత్రయంలా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఒత్తిడి వెనుక బలమైన రాజకీయ భయం దాగి ఉంది. ఒకవేళ స్థానిక ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నిలబడకపోతే, క్షేత్రస్థాయిలో కేడర్ పూర్తిగా నిర్లిప్తతలోకి జారిపోయిందన్న స్పష్టమైన సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. అసెంబ్లీలో 11 సీట్లకు పరిమితమైన తర్వాత, పార్టీ ఇంకా సజీవంగానే ఉందని నిరూపించుకోవడానికి చేపట్టే పర్యటనలు, రోడ్‌షోలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు అన్నీ ఒక్కసారిగా తేలిపోతాయి. ఎన్నికల్లో పోటీ లేకపోవడం వల్ల ప్రత్యర్థి పక్షాలకు ఏకగ్రీవాలు దక్కితే, అది పార్టీ నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందనే భయంతోనే ఓడిపోయినా పర్వాలేదు.. బరిలో నిలబడండి అనే నినాదాన్ని ఆయన ముందుకు తెస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల మానసిక స్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఐదేళ్ల అధికార కాలంలో సంక్షేమ పథకాల బటన్ల పంపిణీకి ఇచ్చిన ప్రాధాన్యత పార్టీకి అండగా నిలిచిన ద్వితీయ శ్రేణి నాయకులకు, సాధారణ కార్యకర్తలకు దక్కలేదనే అసంతృప్తి వారిలో బలంగా ఉంది. పాలనా వ్యవహారాల్లో అక్రమాలు, దందాల ఆరోపణలు ఎదుర్కొన్న పెద్దలు ఇప్పుడు సురక్షితంగా ఇళ్లకే పరిమితం కాగా, క్షేత్రస్థాయిలో ప్రత్యర్థుల నుంచి వచ్చే రాజకీయ ఒత్తిళ్లను, కేసులను తామే భరించాల్సి వస్తోందని కేడర్ ఆందోళన చెందుతోంది. గతంలో పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాకపోవడం, కొత్తగా సొంత జేబుల నుంచి లక్షలు ఖర్చుపెట్టి పోటీ చేసే ఆర్థిక స్తోమత లేకపోవడం కేడర్‌ను వెనుకడుగు వేసేలా చేస్తోంది. గ్రామస్థాయిలో ప్రత్యర్థులతో ఘర్షణ పడి ఆస్తులు, వ్యాపారాలను నష్టపోవడం కన్నా.. స్థానికంగా సర్దుబాటు రాజకీయాలు చేసుకోవడం లేదా మౌనంగా ఉండటమే మేలనే భావన వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో నాయకత్వం నుంచి ఎలాంటి రక్షణ భరోసా లభించనప్పుడు, కేవలం పార్టీ పరువు కాపాడటం కోసం తాము బలిపశువులం కాలేమనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది. కార్యకర్తల్లోని ఈ నైరాశ్యాన్ని గుర్తించినందువల్లే జగన్ వారిని ప్రత్యేకంగా పిలిపించి బతిమాలుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అగ్రనాయకత్వం తన ఉనికిని చాటుకోవడానికి చూస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉన్నాయి

**ఏకగ్రీవం అనుకోవద్దు..**

స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేలా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రంగంలోకి దిగారు. రాష్ట్రంలో అన్ని స్థానాలకు పోటీచేయాలని, ఏ ఒక్క స్థానం ఏకగ్రీవం కాకూడదని ఇప్పటికే నియోజకవర్గ ఇంచార్జులకు ఆదేశాలిచ్చిన జగన్ రెడ్డి తాజాగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కొద్దిరోజుల్లో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో విజయం కోసం వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పోలీసులను ప్రయోగిస్తారని, వారిని ఎదుర్కొని యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారుప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఆయన పార్టీ కేడర్ యుద్ధానికి సిద్దంగా ఉండాలని పిలుపునివ్వడం ద్వారా ఎన్నికల్లో రాజీ లేని పోరాటం చేస్తామని సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా, ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని, ఈ కారణంగా స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి ఓటేస్తారని జగన్ రెడ్డి భావిస్తున్నట్లు చెబుతున్నారు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జగన్ సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా తీసుకోవాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. "పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి" అని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి, యుద్ధప్రాతిపదికన ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఏడాదిలో పాదయాత్ర రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మరోసారి తన పాదయాత్రపై ప్రకటన చేశారు. ఏడాది తర్వాత తాను పాదయాత్ర చేస్తానని, ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత వైసీపీనే అధికారంలోకి వస్తుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అయితే స్థానిక ఎన్నికల్లో అది కనిపించకుండా ఉండేందుకు పోలీసులను వాడుకుంటారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# పొలిటికల్ ఆడిటింగ్ పూర్తి ?
# విజయసాయిరెడ్డి పార్టీ టార్గెట్ ఇదే !



**నెల్లూరు :** రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. అయితే, వైఎస్సార్‌సీపీలో నంబర్ టూగా చక్రం తిప్పి, దేశంలోనే అగ్రశ్రేణి ఆడిటింగ్ మాస్టర్‌గా పేరొందిన విజయసాయిరెడ్డి.. కేవలం ప్రజాసేవ కోసమే కొత్త దుకాణం తెరుస్తున్నారంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. రాజకీయాల్లో సొంత పార్టీ నడపడం అంటే ఆర్థికంగా భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారమని తెలిసినా ఆయన ఈ అడుగు వేస్తున్నారంటే, ఆ పెట్టుబడి వెనుక అంతకుమించిన భారీ ప్రయోజనాలు, సరికొత్త లెక్కలు దాగి ఉన్నాయని స్పష్టమవుతోంది. ఈ సరికొత్త రాజకీయ ప్రయోగం వెనుక ప్రధానంగా వినిపిస్తున్న వాదన వ్యక్తిగత, వ్యాపార రక్షణ కవచం . గత ఐదేళ్ల పాలనలో విశాఖపట్నం భూముల వ్యవహారాలు, దసపల్లా భూ వివాదాలు, లిక్కర్ లావాదేవీలు, అనేక ఆస్తుల క్రయవిక్రయాల్లో ఆయనపై లెక్కలేనన్ని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ఫైళ్లు తిరగదోడే ప్రమాదం ఉండటం, మరోవైపు సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసుల విచారణలు కొనసాగుతుండటంతో.. కేవలం సాధారణ పౌరుడిగా ఉంటే చట్టపరమైన ఉచ్చు బిగుస్తుందన్న భయం ఆయనను వెంటాడుతోందన్న ప్రచారం ఉంది. రేపు ఏ విచారణ సంస్థ దర్యాప్తు చేపట్టినా, రాజకీయ కక్షసాధింపు , కొత్త పార్టీ పెట్టినందుకే వేధింపులు అనే ముద్ర వేసి ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందడానికి ఒక రాజకీయ పార్టీ హోదాను రక్షణ కవచంగా వాడుకోవాలన్నదే ఆయన మొదటి వ్యూహం కావొచ్చు. మరో బలమైన రాజకీయ కోణం బీజేపీ పెద్దల గేమ్ ప్లాన్ . ఢిల్లీలోని కమలనాథులతో విజయసాయిరెడ్డికి ఉన్న బలమైన సంబంధాలు అందరికీ తెలిసినవే. ఏపీలో కూటమి బలంగా ఉండటంతో నేరుగా బీజేపీలో చేరడానికి సాంకేతిక, రాజకీయ ఇబ్బందులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా ఒక వర్గం అసంతృప్తి ఓట్లు వైఎస్సార్ సీపీకి మళ్లీ గంపగుత్తగా పడకుండా నిరోధించేందుకు ఒక ప్రత్యేక టూల్ గా ఈ కొత్త పార్టీని రంగంలోకి దించుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తటస్థంగా ఉంటూనే, తెరవెనుక ఢిల్లీ పెద్దల ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదిపేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఇక మూడో కోణం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మైండ్ గేమ్. వైఎస్సార్‌సీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రాబల్యం పెరిగి తనను పక్కనపెట్టిన నాటి నుంచి రగిలిపోతున్న విజయసాయిరెడ్డి.. తాడేపల్లి ప్యాలెస్‌కు గట్టి చెక్ పెట్టాలని చూస్తున్నారు. వైఎస్ కుటుంబానికి చెందిన నమ్మకస్తుడైన ఆడిటర్‌గా పార్టీలోని ప్రతి నాయకుడి ఆర్థిక మూలాలు, అంతర్గత బలహీనతలు, క్షేత్రస్థాయి నెట్‌వర్క్ ఆయనకు కొట్టినపిండి. కొత్త పార్టీ వేదిక ద్వారా వైఎస్సార్‌సీపీలోని అసంతృప్త నేతలను, ద్వితీయ శ్రేణి కేడర్‌ను తనవైపు తిప్పుకుని జగన్ ఓటు బ్యాంకును చీల్చగలనని బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడ కూడా ఇందులో దాగి ఉండవచ్చని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఒక ప్రాంతీయ పార్టీని స్థాపించి క్షేత్రస్థాయిలో నిలబెట్టడం అనేది సాధారణ వ్యవహారం కాదు. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికో లేక బేరసారాల కోసమో పెట్టిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోయిన చరిత్ర ఏపీలో ఎన్నో ఉన్నాయి. విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ పాచికల వెనుక ఉన్న అసలు లక్ష్యం ? కేసుల నుంచి ఆత్మరక్షణ కోసమా, బీజేపీ రాజకీయ ప్రయోగమా లేక జగన్‌పై ప్రతీకారమా అన్నది ఆయన పార్టీ అధికారిక ప్రకటన చేసి మొదటి అడుగు వేసిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

# ప్రకాశంలో ఫ్యాన్ రెక్కలు కకావికలం



**ఒంగోలు :** రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయాయి. 2024 ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 8నియోజకవర్గాల్లో 6 స్థానల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. అప్పటివరకు అధికారంలో వున్న వైసీపీ కేవలం రెండు చోట్ల మాత్రమే అతి కష్టం మీద గెలిచింది. ఒంగోలు పార్లమెంట్ స్థానంలో కూడా టీడీపీ జెండా ఎగరేసింది. ఇది అందరికీ తెలిసిందే. ఈ రెండేళ్ల కాలంలో టీడీపీ బలం ఏమాత్రం తగ్గిన దాఖలాలు లేవు. వైసీపీ పుంజుకున్న ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఇంకా చెప్పాలంటే ఘోర ఓటమి నుంచి వైసీపీ ఇంకా కోలుకోలేదు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ఆ పార్టీకి నాయకత్వం లేకుండా పోయిన పరిస్థితి కనిపిస్తుంది. ఒంగోలు పార్లమెంట్ కు కనీసం ఇంచార్జిని కూడా నియమించుకోలేని దీనస్థితిలో కొట్టు మిట్టాడుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాలుగు రోజులు హడావుడి చేసినప్పటికి ఇప్పుడు ఇటు వైపు తొంగిచూడటం లేదు. ఈసారి ఎన్నికల్లో కొత్తగా అభ్యర్థిని వెదుక్కోవాల్సిన దుస్థితి వుంది. ఇక ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి వెళ్లిపోయాక కార్యకర్తలు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. చుండూరి రవిబాబు ఇంచార్జిగా పనిచేస్తున్నప్పటికీ పార్టీ శ్రేణులకు నమ్మకం కలిగించలేక పోతున్నాడు. కొండపి నియోజకవర్గంలో మరో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇష్టం లేని కాపురం చేస్తున్నారు. మాటి మాటికీ పాత ఇంటి వైపు తొంగి చూస్తున్నారు. గిద్దలూరులో కుందూరు నాగార్జున రెడ్డి పరిస్థితి కూడా అంతే. ఆయనకు మార్కాపురం మీదనే మనసుంది. గిద్దలూరులో పోటీ చేస్తే గెలిచే అవకాశం ఉన్నప్పటికీ అన్నా రాంబాబు మార్కాపురం వదిలి పెట్టనని మంకు పట్టు పడుతున్నారు. ఎర్రగొండ పాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కు ఆదిమూలపు సురేష్ తలనొప్పిగా తయారయ్యాడు. దర్శిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్ కు పార్టీలో సమస్య లేదు కానీ టీడీపీ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. కనిగిరిలో దద్దాల నారాయణను బలవంతంగా కొనసాగిస్తున్నారని పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నారు. ఇకపోతే అద్దంకి నియోజకవర్గం వైసీపీకీ మింగుడు పడటం లేదు. 2019లో కూడా అక్కడ గొట్టిపాటి రవికుమార్ టీడీపీ జెండా ఎగరేశారు. ఇప్పుడు మంత్రిగా మరింత పట్టు సాధించారు. ఇక్కడ వైసీపీకి సీజన్ కు ఒకరు చొప్పున ఇంచార్జిలు మారుతున్నారు. ప్రస్తుతం అశోక్ కుమార్ ఇంచార్జిగా వున్నారు. ఈయన కొనసాగుతారో, కొత్త ఇంచార్జి వస్తాడో కేడర్ కు తెలియదు. కొండపిలో కూడా వైసీపీకి ఒక ఇంచార్జి లేడు. పార్ట్ టైమ్ లీడర్ గా సురేష్ వ్యవహారిస్తున్నట్లు కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. ఒంగోలు ఎంపీ సీటు ఖాళీగా వుంది. ఇలాంటి పరిస్థితిలో పార్టీ ఎప్పటికి కోలుకుంటుందో ఏమో అని వైసీపీ శ్రేణులు గొనుక్కుంటున్నారు.

## ఎంపీ అవినాష్‌రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు

-మొదటిపేజీ తరువాయి

భారీగా నగదు అక్రమ మార్పిడి, మనీ లాండరింగ్ జరిగినట్లు స్పష్టమవడంతో ఈ సొమ్మును నిందితులకు ఎవరిచ్చారు? దీని వెనుక ఎవరున్నారు? ఇంత మొత్తం ఎక్కడినుంచి వచ్చింది? అనే కోణాల్లో హైదరాబాద్‌లోని జోనల్ ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. 5 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో 7 చోట్ల సోదాలు చేశారు.

**దస్తగిరి ఇంట్లోనూ తనిఖీలు:**

ఎంపీ అవినాశ్‌రెడ్డికి చెందిన హైదరాబాద్ కోకాపేటలోని ఓపెన్ స్కైస్‌లోని నివాసంతో పాటు పులివెందులలోని ఆయన ఇంట్లోనూ అధికారులు సోదాలు చేశారు. పులివెందులలో ఇంటికి తాళం వేసి ఉండటంతో కొద్దిసేపు బయటే వేచి ఉన్నారు. కాసేపటికి అవినాశ్‌రెడ్డి చిన్నాన్న మనోహర్‌రెడ్డిని పిలిపించి తాళం తెరిపించారు. హత్య కేసులో కీలక నిందితులు సునీల్ యాదవ్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి నివాసాల్లోనూ సోదాలు చేశారు. తొండూరు మండలం టి. తుమ్మలపల్లిలో ఉంటున్న మరో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి, అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇంట్లోనూ తనిఖీలు చేశారు.

శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డిని ఈడీ అధికారులు కడప నుంచి పిలిపించారు. శివశంకర్‌రెడ్డి నివాసంలో అతన్ని విచారించారు. 2023 నవంబర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు పేరిట కడప జైలుకు వెళ్లిన చైతన్యరెడ్డి అక్కడ రిమాండ్ ఖైదీగా ఉన్న దస్తగిరిని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చైతన్యరెడ్డిని విచారించినట్లు తెలుస్తోంది. సోదాల్లో అవినాశ్ రెడ్డి నివాసం నుంచి లెక్కతేలని 24 లక్షల రూపాయల నగదు, 2 బ్యాంక్ లాకర్ల తాళాలు, కీలక డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. హత్యకు సంబంధించిన 40 కోట్ల సుపారీపై దృష్టి సారించినట్లు వెల్లడించారు.

## ఈ నెల 29 నుంచి సీడ్ యాక్సెస్
## రహదారి మూడో దశ పనులు

-మొదటిపేజీ తరువాయి

విజయవంతంగా జరిగిందని చెప్పారు. రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ నిర్మాణంపై దృష్టి సారించామని.. ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఇకపై ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. రైతుల ప్లాట్ల అభివృద్ధి కోసం ఈనెల 27న టెండర్లు ఓపెన్ చేస్తున్నామని, ఆ తర్వాత వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

## ఏపీ మున్సిపాలిటీల
## సమూల ప్రక్షాళన

-మొదటిపేజీ తరువాయి

ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ముందుకెళ్తోంది. మంజూరైన రూ.7,469.46 కోట్లలో రూ.5,500 కోట్లు మూలధన పనులకు, మిగతా రూ.1,969.46 కోట్లు పదేళ్ల వడ్డీ చెల్లింపుల కోసం కేటాయించారు. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 4,388 కి.మీ మేర రోడ్ల నిర్మాణం, 541 పార్కులు, 1,186 కి.మీ సెంట్రల్ మీడియన్లు, 20,340 వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం అంటే రూ.2,200 కోట్లు, ప్రభుత్వం ఎల్ఆర్ఎస్/బీపీఎస్ నిధుల ద్వారా ముందుగా చెల్లిస్తుంది.

**పదేళ్ల పాటు నిర్వహణ**

మిగతా 60 శాతం అంటే రూ.3,300 కోట్లు గుత్తేదారు సంస్థ భరిస్తుంది. పనులు పూర్తయిన తర్వాత పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా ఆ సంస్థదే. ఎస్క్రో ఖాతా ద్వారా 40 త్రైమాసిక వాయిదాల్లో ప్రభుత్వం వారికి నిధులు చెల్లిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో మౌలిక వసతుల లేమిపై ప్రభుత్వం శాస్త్రీయంగా గ్యాప్ అసెస్‌మెంట్ నిర్వహించింది. అమృత్ 2.0, ఏఐఐబీ, యూఐడీఎఫ్ పథకాల ద్వారా ఇప్పటికే రూ.15,274 కోట్ల పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులను విడివిడిగా కాకుండా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర పనులన్నింటినీ ఒకేసారి సమగ్రంగా చేపట్టాలని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. జనాభా వృద్ధి, భవిష్యత్ అవసరాలకు ముందే మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్? కుమార్ వెల్లడించారు.

**తొలిదశలో 1,153 ఎలక్ట్రిక్ ఆటోలు**

పట్టణాభివృద్ధితో పాటు పారిశుద్ధ్యం, రాజధాని నిర్మాణాలపైనా సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. చెత్త రహిత పట్టణాల కోసం 108 సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు ఇప్పటికే వర్క్ ఆర్డర్లు జారీ చేసింది. ఇంటింటి చెత్త సేకరణ కోసం తొలిదశలో 1,153 ఎలక్ట్రిక్ ఆటోలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రంగంలోకి దించుతోంది. రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కోసం ఏకంగా రూ.66,802 కోట్ల పనులు మంజూరు కాగా, ఇప్పటికే రూ.43,422 కోట్ల పనులు మొదలయ్యాయి. పెండింగ్‌లో ఉన్న ఏపీ టిడ్కో ఇళ్ల నిర్మాణాలను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

## పాపం..వంశీమోహన్
## కర్మ రిటర్న్స్

**విజయవాడ:** ఉమ్మడి కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని నాయకుడిగా, గన్నవరం నియోజకవర్గంలో చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరిస్థితి ఇప్పుడు సొంత పార్టీలోనే అత్యంత దయనీయంగా మారిందనే చర్చ జోరందుకుంది. వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసేందుకు విమానాశ్రయానికి వెళ్లిన వంశీకి అక్కడ విచిత్రమైన, అవమానకరమైన పరిస్థితి ఎదురైంది. విఐపీ విభాగానికి లేదా ప్రత్యేక పరిధికి అనుమతి దక్కకపోవడంతో, ఆయన సాధారణ కార్యకర్తలు, అభిమానులతో పాటు బారికేడ్ల వెనుక నిలబడాల్సి వచ్చింది. జగన్ బయటకు వచ్చే క్రమంలో ఆయన దృష్టిలో పడేందుకు మిగతా వారితో పాటు తోసుకుంటూ వెళ్లి పలకరించడానికి ప్రయత్నించిన దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఒకప్పుడు నియోజకవర్గంలో సొంత ముద్ర వేసుకుని, అసెంబ్లీలోనూ బలమైన నేతగా నిలిచిన వంశీలాంటి సీనియర్ నేత.. ఈ రకంగా పలకరింపు కోసం నిలబడటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వీడియోలు బయటకు రావడంతో సోషల్ మీడియా నెటిజన్ల నుంచి, ఆయన అభిమానుల నుంచి విభిన్న ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో గన్నవరంలో ఒక వెలుగు వెలిగిన నాయకుడికి, ఈరోజు సొంత పార్టీ అధినేతను కనీసం గౌరవగా పలకరించే వెసులుబాటు కూడా లేకపోవడం ఏంటి అంటూ పలువురు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అతి రాజకీయాలే ఆయనను ఈ స్థితికి తెచ్చాయని విమర్శిస్తున్నారు. ఈ ఘటనతో వల్లభనేని వంశీ అనుచరులు, స్థానిక వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో గుసగుసలాడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో సుదీర్ఘకాలం కీలకంగా వ్యవహరించి, పార్టీ కోసం అనేక రకాల సవాళ్లను ఎదుర్కొన్న మాజీ ఎమ్మెల్యేలకు, సీనియర్ నాయకులకు కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా ఈ రకంగా విమానాశ్రయం బయట రోడ్డుపై లేదా బారికేడ్ల వెనుక నిలబెట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. పార్టీ నాయకత్వమే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, జగన్‌ను విడిగా కలిసే సమయాన్ని లేదా తగిన గౌరవాన్ని కల్పించి ఉండాల్సిందని స్థానిక నాయకత్వం బహిరంగంగానే పెదవి విరుస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత వైఎస్ఆర్‌సీపీలో లీడర్‌షిప్ మేనేజ్‌మెంట్ స్పష్టంగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు నడిచిన వ్యవస్థ వేరు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శ్రేణులను, సీనియర్ నేతలను గౌరవించుకునే విధానం వేరు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిలబడిన మాజీ ఎమ్మెల్యేలను ఇలా సాధారణ కేడర్ తరహాలో నెట్టివేస్తే, రాబోయే రోజుల్లో మిగతా నేతల్లో కూడా నిరాశ పెరిగి పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వంశీకి జరిగిన ఈ వీధి పరాభవం ద్వితీయ శ్రేణి నాయకుల్లో మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే అంశంగా మారింది. గన్నవరం రాజకీయంలో ఎంతో ప్రాబల్యం ఉన్న వల్లభనేని వంశీకి ఎదురైన ఈ అనుభవం.. వైఎస్ఆర్‌సీపీలో నేతలకు దక్కుతున్న ప్రాధాన్యతపై అనుమానాలు రేకెత్తిస్తోంది. కేవలం ప్రచారానికి, కార్యకర్తలను సమీకరించడానికే సీనియర్లను వాడుకుని, అధినేతను కలిసే సమయంలో సాధారణ జనంలా నిలబెట్టే సంస్కృతి తగదని సొంత పార్టీ నేతలే భావిస్తున్నారు.

# ఉత్తమ ప్రతిభ కు సేవా పథకం అందుకున్న కానిస్టేబుల్ పి.సీ యల్లప్ప కు ఘన సన్మానం



**గుంతకల్లు ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న పిసి యల్లప్ప విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున 80 వ స్వాతంత్ర దినోత్సవ ఆగస్ట్ – 15 వేడుకలు సందర్భంగా అనంతపురం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖమాత్యులు పయ్యావు ల కేశవ్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ మరియు యస్పీ జగదీష్ గార్ల చేతుల మీదుగా సేవా పథకం అందుకున్నందుకు పట్టణం లోని బహుజన సమాజ్ పార్టీ మరియు దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కానిస్టేబుల్ పీసీ యల్లప్పను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జ్ మరియు గుంతకల్లు నియోజకవర్గం ఇంచార్జ్ బైనేని శ్రీనివాస రాజు మాట్లాడుతూ” ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న యల్లప్ప పట్టణంలోని అనేక మంది ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా, విధి నిర్వహణలో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ అటు పోలీస్ ఆఫీసర్లతోనూ,ఇటు ప్రజలతోనూ గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి యల్లప్ప అని, అన్ని వర్గాల ప్రజలతో ను, దళిత ప్రజా సంఘాల తోనూ కలివిడిగా ఉంటూ ఎంతో పేరు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు, యల్లప్పకు ఈ సేవా పథకం రావడానికి సహకరించిన పట్టణ డిఎస్పికి, పట్టణ సిఐ కి, మరియు పోలీసు సిబ్బందికి బహుజన సమాజ్ పార్టీ తరపున మరియు దళిత ప్రజా సంఘాల తరపున కృతజ్ఞతలు తెలియజేయ డ మైనది “అని అన్నారు. దళిత ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు ఎం. మహేంద్ర మాట్లాడుతూ కానిస్టేబుల్ యల్లప్ప ఎవరికి ఏం అవసరం వచ్చినా పలికే వ్యక్తి అని, అనతి కాలంలో నే పట్టణంలో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి అని పోలీసు డిపార్ట్మెంట్ కి వన్నెతెచ్చిన నికార్సైన పోలీస్ కానిస్టేబుల్ అని ప్రశం సించారు, భవిష్యత్తు లో మరెన్నో ఉత్తమ అవార్డులు రివార్డులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నాము అని” అన్నారు. ఈ కార్యక్ర మంలో బీఎస్పీ నాయకులు దళిత ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ సాహుల్ హమీద్, తలారి నరసన్న, పోలా అల్లా బకాష్, ప్రకాష్, మస్తానప్ప, రాజేష్, రామచంద్ర, ఎం.జె. విల్సన్ బాబు, ఎర్రి స్వామి, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు.. ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి వైద్య సదుపాయాలు కల్పించాలి

## పేద విద్యార్థుల, పేద ప్రజల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరి నశించాలి



**గుంతకల్లు ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పేద విద్యార్థులకు, పేద గ్రామీణ ప్రజలకు సరైనటువంటి వైద్యం అందించాలని, ప్రైవేట్ వైద్య బారం వద్దు, తేజ ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు, గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్యం కావాలని శుక్రవారం సిపిఐ మండల పార్టీ, పిడిఎస్యు, ఏవీఎస్, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ధర్నా నిర్వహించి ఇన్చార్జ్ సిఎంఎస్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ మండల మండల పార్టీ కార్యదర్శి పి. రాము రాయల్, పి డి ఎస్ యు నియోజకవర్గ కార్యదర్శి మహేష్ గుప్తా, వి.వినోద్, ఏవీఎస్ జిల్లా అధ్యక్షుడు వాల్మీకి వంశీ గుంతకల్లు పట్టణంలో ప్రభుత్వ హాస్పిటల్ లో పేద విద్యార్థులకు, పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని. అదేవిధంగా పట్టణంలో ప్రభుత్వ హాస్పిటల్లో 200 పడకల కు పెంచాలి గుంతకల్లు, గుంతకల్లు మండలం తో పాటు మద్దికెర, వజ్రకరూ రు, గుత్తి, పట్టణం, చిప్పగిరి, విడపనకల్లు మండలం వెల్దుర్తి, పత్తి కొండ మండలాల నుంచి వేల మంది వస్తున్నారు, కానీ సరైనటువంటి సౌకర్యాలు లేవు. అదేవిధం గా క్యాజువాలిటీ వార్డు 24 గంటలు ముందు భాగంలో పెట్టాలి. డాక్టర్లు ఉదయం 9 నుండి సాయంత్రం 4 వరకు అందుబాటులో ఉండాలి. పోస్టుమార్టం గది దగ్గర డీ–ఫ్రీజ్ ,పెట్టాలి, బెడ్ షీట్లు రోజూ మార్చాలి. డాక్టర్లు 5 రోజులకు మందులు రాస్తే ఫార్మసీలో 3 రోజులకు మాత్రమే ఇస్తున్నారు రక్త పరీక్ష గది చాలా ఇరుకుగా ఉంది, విశాలమైన చోటికి మార్చాలి. దాతలు ఇచ్చిన అంబులెన్సును వాడట్లేదు, వాటిని వాడాలి.ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి, ఎముకలకు సంబంధించి నటువంటి శస్త్ర చికిత్సలు నిర్వహించాలి, సదరం సర్టిఫికెట్ల క్యాంపులో కొంతమంది సిబ్బంది. చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. అలాంటి వారి పైన చర్యలు తీసుకోవాలని, గర్భిని స్త్రీల కు రాత్రి సమయంలో కూడా డెలివరీలు ఆపరేషన్లు నిర్వహించాలని, ప్రభుత్వ హాస్పిటల్ లో సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ ఏర్పాటు చేయాలి. అదేవిధంగా ఎక్కువ సిబ్బందిని నియమించి. రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని. అనంతరం ఇన్చార్జ్ సూపర్డెంట్ జవర్దన్ రెడ్డి సార్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నియోజకవర్గ కార్యదర్శి సభ్యుడు బి.రాజేష్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పి. కమల్,తలారి సాయి, నాయకులు సోము, వర్ధన్, చిన్న తదితర నాయకులు పాల్గొనడం జరిగింది.

## చొప్పెల్ల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతములు.





**ఆలమూరు ఆగష్టు 21(ప్రజాజ్యోతి):** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ దేవత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన 300 మంది పైగా భక్తులు. వ్రతములో పాల్గొన్నవారందరికీ వెండి రూపు, డజను గాజులు పసుపు, కుంకుమ వేసుకునే భరిణి, అమ్మ వారి ప్రసాదం అందజేత. వరలక్ష్మి వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ అమ్మవారి దర్శనం. ఆలయ కమిటీ వారు శ్రావణ శుక్ర వారం సందర్భంగా ఉచిత సామూహిక వర లక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వ్రతాన్ని ఆలయ అర్చకులు యలమంచిలి పళ్ళంరాజు (రాజశేఖర్), బుచ్చిరాజు సోదరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంత రం వరలక్ష్మీవ్రతంలో భాగంగా భక్తులందరి చేత విడివిడిగా కలశస్థాపన చేయించి వరలక్ష్మీదేవివారిని సమంత్రకంగా ఆవాహన చేయడం జరిగింది. తరువాత శ్రీసూక్తవిధానంలో వ్రతకల్పపూర్వకంగా వరలక్ష్మీదేవివారికి షోడశోపచారపూజ లు జరిపించబడ్డాయి. అనంతరం అర్చక స్వాములు వ్రతకథను పఠించి వ్రతమహి మావిశేషాలను భక్తులకు తెలియజేశారు. చివరగా నీరాజన మంత్రపుష్పా లను జరిపి వ్రతసమాప్తి చేయబడింది. ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనడం ఎంతో హర్షించదగ్గ విషయమని ఆలయ కమిటీ వారు సంతోషం వ్యక్తం చేసారు.వరలక్ష్మీవ్రతాన్ని జరిపించుకున్న వారందరు కూడా ఎంతో అదృష్టవంతులని, అందరికీ శ్రేయస్సు కలుగు తుందని ఆలయ అర్చక స్వాములు అన్నారు.

# బీసీల రాజకీయ భవిష్యత్తుకు కొత్త బాట.. 34 శాతం రిజర్వేషన్లపై ఆలమూరు టీడీపీ బీసీ కమిటీ హర్షం



**ఆలమూరు ఆగష్టు 21(ప్రజాజ్యోతి):**డా బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ ఆలమూరు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఆలమూరు మండల టీడీపీ బీసీ కమిటీ ఘనంగా స్వాగతించింది. ఈ నిర్ణయం బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచడంతో పాటు, స్థానిక సంస్థల్లో వారికి సముచిత స్థానం కల్పించే దిశగా కీలక అడుగుగా నిలుస్తుందని కమిటీ నాయకులు పేర్కొన్నారు.బీసీలకు కేవలం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా, అధికారంలోనూ, నిర్ణయాలు తీసుకునే వ్యవస్థలోనూ వారికి భాగస్వామ్యం కల్పించడమే నిజమైన సాధికారత అని వారు తెలిపారు. 34 శాతం రిజర్వేషన్ల నిర్ణయం బీసీ వర్గాల రాజకీయ అవకాశాలను మరింత విస్తృతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీల సంక్షేమం, అభ్యున్నతి, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కృషి చేస్తూ వస్తోందని వారు గుర్తుచేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్ తరాలకు కూడా ప్రయోజనం చేకూర్చే కీలక నిర్ణయంగా నిలుస్తుందని పేర్కొన్నారు.బీసీలకు రాజకీయ అవకాశాలు పెరిగితేనే వారి సమస్యలు పాలనా వ్యవస్థలో బలంగా ప్రతిధ్వనిస్తాయని, అందుకు 34 శాతం రిజర్వేషన్లు ఒక బలమైన వేదికగా మారనున్నాయని ఆలమూరు మండల టీడీపీ బీసీ కమిటీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ బీసీ వర్గాల తరపున హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతి ఇంటికీ చేరిన సూపర్ సిక్స్ పథకాలు



**ప్యాపిలి :**ప్యాపిలి పట్టణములో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరిస్తున్న ప్యాపిలి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొంగనపల్లి మధు, ప్రిన్సిపాల్ మధు పట్టణం లొ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండేళ్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ప్యాపిలి పట్టణం లో విస్తృత ప్రచారం నిర్వహించారు.ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపె ట్టిన విప్లవాత్మక పథకాల గురించి ప్రజలకు వివరించారు.

**ప్రతి ఇంటికీ చేరిన సూపర్ సిక్స్ పథకాలు**

ఈ సందర్భంగా టిడిపి ప్యాపిలి మండల అధ్యక్షుడు మధు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రవేశపెట్టిన ‘తల్లికి వందనం’ పథకం ద్వారా ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి పిల్లల చదువులకు ప్రభుత్వం అందిస్తున్న భరోసాను వివరించారు. అదేవిధంగా, మహిళల సాధికారతకు బాటలు వేస్తూ ప్రవేశపెట్టిన ‘శ్రీశక్తి’ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు**

గత రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిరుద్యోగ భృతి, రైతులకు పెట్టుబడి సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి మిగతా అన్ని సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు కూలంకషంగా వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయాకు అతీతంగా పథకాలు అందుతాయని, ఏ ఒక్కరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

## వేడంగిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం.



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగష్టు 21.** జిన్నూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో పోడూరు మండలం వేడంగిలో శివాలయం సెంటర్ వద్ద శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిభిరంలో ఆయుర్వేద వైద్యులు మల్లేశ్వరి, గిరీష్ ఆయుర్వేద వైద్య సేవలు అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన వారి ఆరోగ్య సమస్యలను వైద్యపరమైన సమస్యలను విని తెలుసుకుని వారికి తగిన సలహాలు ఇచ్చి అవసరమైన ఆయుర్వేద మందులను అందజేశారు ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భజన ఏకాహానికి మురళీ కృష్ణంరాజు రూ.5 వేలు విరాళం

ధర్మవరంలో శ్రీ రాజగోపాలస్వామిని దర్శించుకున్న
వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి



**కాకినాడ జిల్లా ఆగస్టు 21(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో శ్రావణమాసం శ్రీ వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన భజన సమాజాల ఏకాహ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు,ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకుడు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.భజన కమిటీ ఆహ్వానం మేరకు ధర్మవరం గ్రామంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాలస్వామి దేవస్థానానికి చేరుకున్న ఆయన కలశం ఏర్పాటు చేసి ఏకాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని ఏకాహ కార్యక్రమ నిర్వహణకు రూ.5 వేల విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు,కోలా తాతబాబు,మాజీ సొసైటీ అధ్యక్షుడు బొల్లు రాజుబాబు,బొల్లు నల్ల అబ్బాయి,పాల నూకరాజు,కుప్పిన శ్రీను,సిద్దా కాశీతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఆలమూరు గ్రామానికి చెందిన కొండేపూడి నీలిమ ఎంపిక.



**ఆలమూరు ఆగష్టు 21 (ప్రజాజ్యోతి):**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఆలమూరు గ్రామానికి చెందిన కొండేపూడి నీలిమ అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన నీలిమను ఈ నెల 24వ తేదీన తిరుపతిలో జరగనున్న అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఆమె కోచ్ సందీప్ కిరణ్ తెలిపారు. నీలిమ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని అమలాపురం స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ రుద్ర, టెక్నికల్ డైరెక్టర్ సి.హెచ్. చంద్రశేఖర్, గ్రాండ్ మాస్టర్ టి. అబ్బులు, మాస్టర్ చంద్రకుమార్ ఆకాంక్షించారు. జిల్లాస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆలమూరు గ్రామానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. నీలిమను మండల ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## రెండేళ్ల నమ్మకం!..

అభివృద్ధి–సంక్షేమం!..డోర్”టూ”డోర్ కార్యక్రమం!..
తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్!..




వి.ఆర్.పురం,ఆగస్టు21(ప్రజాజ్యోతి ప్రతినిధి)మండలం ములకన పల్లి పంచాయితీ, జల్లివారిగూడెం,గ్రామంలోశుక్రవారం కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం డోర్”టూ”డోర్,కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,ఐ.టి.డి.పి,కన్వీనర్ ఆకోజు భాగ్యలక్ష్మి,ముత్యాల శ్రీధర్,ఆకోజు రంగాచారి,జల్లి లక్ష్మణ్,జల్లినరేష్,శ్రీను,గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## పూండ్లలో ఓటర్ల కేసులపై విచారణ



**బాపట్ల ఆగస్టు 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలపై అభ్యంతరాలు, వ్యత్యాసాలను పరిష్కరించే ప్రక్రియలో భాగంగా పూండ్లలో శుక్రవారం విచారణ నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ నంబర్ 5 పరిధిలో నోటీసులు అందుకున్న 133 మంది ఓటర్ల నుంచి అధికారులు వివరాలు సేకరించారు. తహసీల్దార్ సలీమా ఆధ్వర్యంలో జరిగిన విచారణకు హాజరైన ఓటర్లు తమకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించారు. అధికారులు వాటిని పరిశీలించి ఓటర్ల జాబితాలోని నమోదులతో ధ్రువీకరించారు. ఓటర్ల వివరాల్లో ఉన్న లాజికల్ డిస్క్రెపెన్సీలు, మ్యాపింగ్ సమస్యలను గుర్తించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. విచారణ అనంతరం అర్హత, ఆధారాలను బట్టి సంబంధిత కేసులపై నిర్ణయం తీసుకోనున్నారు.

## చిరంజీవి జన్మదిన వేడుకల్లో బాపట్ల జనసేన నేతల రక్తదానం



**బాపట్ల ఆగస్టు 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని బాపట్లకు చెందిన జనసేన నాయకులు రక్తదానం చేసి సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు, బాపట్ల ఏఎంసీ డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ, బాపట్ల పట్టణ నాయకుడు కారుమూరి అంజినేష్ పాల్గొన్నారు. అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు రక్తదానం చేశారు. చిరంజీవి జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించాలనే ఉద్దేశంతో రక్తదానానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

## సీనియర్ పాత్రికేయుడిని పరామర్శించిన మాల సంఘాల రాష్ట్ర జేపీసీ.. కన్వీనర్ దస్తగిరి



**నంద్యాల ఆగస్టు 21 ప్రజాజ్యోతి** నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో గత వారం రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో చికిత్స పొందుతున్న సీనియర్ పాత్రికేయులు (విశాలాంధ్ర) బాల ఓబయ్యను రాష్ట్ర మాల సంఘాల జేపీసీ కన్వీనర్ దస్తగిరి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బండి దేవాంతకుడు, దళిత సమైక్య జిల్లా కన్వీనర్ ఆల్వకొండ ప్రేమ్ కుమార్ లు శుక్రవారం పరామర్శించారు. అనంతరం వివిధ ఖర్చుల నిమిత్తం బాల ఓబయ్య కుమారుడుకు తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. తమ పాత్రికేయ వృత్తిలో అనేక ప్రజా సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిజాని నిర్భయంగ వ్రాసీ పరిష్కరించేవారన్నారు. అటువంటి పాత్రికేయులు నేడు అనారోగ్యంగా ఉండడం చాలా బాధాకరమన్నారు. ప్రస్తుత సమయంలో బాల ఓబయ్య కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. దేవుడు ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో నంది పత్రిక జిల్లా బ్యూరో వెంకట్, మాల మహానాడు నాయకులు ప్రజా జ్యోతి రిపోర్టర్ యస్ ,భాస్కర్, అన్నపురెడ్డి కుమార్, సందీప్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు సుప్రీం కోర్ట్ గుడ్ న్యూస్

**నంద్యాల:ఆగస్టు=21**




**ప్రజాజ్యోతి** పెన్ను పట్టిన,వీడియో కెమెరా పట్టి తమ విధులు రోజు వారి వార్త, న్యూస్ ప్రసారాలు నిర్వహిస్తున్నా వారందరు జర్మలిస్టులే.!! సుప్రీం కోర్ట్ ఇకపై కావాలనే కక్ష్య తో రాజకీయ నాయకులు, అక్రమ సంపాదన దందాలు చేసే వారు, వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతలపై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్ట్ లపై అక్రమ కేసులు చెల్లనేరవని భారత సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. శాటిలైట్ ఛానెల్స్, యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్, ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసుల లేక నిజ నిరూపణ కేసుల అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుందని, వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళపై, అట్టి పోలీస్ లపై వేట తప్పదని హెచ్చరించిన సుప్రీం కోర్ట్.

# వరి నారతో వైఎస్సార్‌సీపీ వినూత్న నిరసన

**తుంగభద్ర డ్యామ్ నుంచి ఎల్ఎల్సీకి వెంటనే నీరు విడుదల చేయాలని రాజీవ్‌రెడ్డి డిమాండ్**






**ఎమ్మిగనూరు, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):** రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్న నిరసన చేపట్టారు. రైతుల సమస్యలపై పార్టీ చేపట్టిన 'పోరుబాట' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఎల్ఎల్సీ కార్యాలయం వద్ద వరి నారతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తుంగభద్ర డ్యామ్ నుంచి ఎల్ఎల్సీ కాలువకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేతుల్లో వరి నారను పట్టుకుని నిరసన తెలిపారు. సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని రాజీవ్‌రెడ్డి ఆరోపించారు. వరి సాగు కోసం రైతులు ఇప్పటికే పెట్టుబడులు పెట్టారని, సమయానికి నీరు అందకపోతే పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. తుంగభద్ర డ్యామ్ నుంచి ఎల్ఎల్సీకి వెంటనే నీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటికే పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టాన్ని అంచనా వేసి తక్షణమే పరిహారం అందించాలని రాజీవ్‌రెడ్డి కోరారు. రైతుల సాగునీటి సమస్య పరిష్కారం అయ్యే వరకు వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు బసిరెడ్డి, కనకవీడు లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ గొల్ల కేసన్న, యుత్ నాయకులు వెంకటాపురం రాజు, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు తగ్గించి కొట్టమని ఏజీవో చెప్పింది?..

**రీవాల్యుయేషన్ పెట్టుకున్న వారికి అమౌంట్, తగ్గించి కొడతామన్న ఏజీవో చెపుతుంది అధికారులు వెల్లడించాలి?..**

**నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంలో విభజించి పాలిస్తున్న అధికారులు!..**

**పెండింగులో ఉన్న ఇంటిడబ్బులు తక్షణమేలబ్ధిదారులకు ఇవ్వాలి!..**

**లేకుంటే మరో భారీ ఉద్యమం తప్పదు!..సి.పి.ఎం,పార్టీ హెచ్చరిక!..**







**వి.ఆర్.పురం,ఆగస్టు21(ప్రజాజ్యోతి ప్రతినిధి)**రీవాల్యుయేషన్ పెట్టుకుంటే తగ్గించికొట్టమని ఏ జీవో చెప్పుతుందో అధికారులు, వెల్లడించాలని,సి.పి.ఎం,పార్టీ జిల్లా నాయకులు సున్నం రాజులు అధికారులను నిలదీశారు.శుక్రవారం మండలంలోని రేఖపల్లి, బొప్పెన భీమయ్య, కార్యాలయంలో కారం సుందరయ్య, అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.పి.ఎం,పార్టీ,జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సున్నం రాజులు, మాట్లాడుతూ మండలంలోని వడ్డిగూడెం, వి.ఆర్.పురం, గుండుగూడెం, చింతరేగుపల్లి, రాజుపేట, గ్రామాల్లో టేక్చర్ వాల్యుయేషన్ అమౌంట్ ఇంతవరకు పడలేదని రీవాల్యు యేషన్ పెట్టుకున్న వారికి అమౌంటు, లక్షతగ్గించి కొడతామని చెప్పటం ఏ జీవోలో? ఉందని ఏజీవో ప్రకారంతగ్గించి కొడతారని ఆయన ప్రశ్నించారు.లక్ష తగ్గించి కొడతామన్న అమౌంటు ఎవరి జేబులోకి వెళ్తుందో, ప్రభుత్వం, అధికారులు,చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.అధికారులు మాకు ఇష్టం వచ్చినట్టుచేస్తాం,అంటూ బెదిరింపులకు పాల్పడటం సమంజసంకాదని, ఆరోపించారు. అమాయక ప్రజలను ఇష్టమొచ్చినట్టుగా బిహేవ్ చేస్తే చూస్తూ ఊరుకుంటామని అనుకుంటే పొరపాటేనని హెచ్చరించారు. అలా అధికారులు మాట్లాడటం సరైనపద్ధతి కాదని చెప్పారు. ప్రాజెక్ట్ కోసం ఇంత త్యాగం చేస్తుంటే ప్రభుత్వంఅధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహారిస్తారా?అని ప్రశ్నించారు. రివాల్యుయేషన్ పెట్టుకున్న వారికి అమౌంటు కొట్టడానికి అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహారించడం పద్దతి కాదని, పద్దతి మార్చుకోవాలని హితవుపలికారు.ఇంటి వాల్యుయేషన్ కొంతమందికి చిన్నఇంటి నిర్మాణానికి పెద్ద అమౌంట్ కొంతమందికి పెద్ద ఇంటికి నిర్మాణానికి చిన్న అమౌంట్, ఇదిఅధికారుల నిర్లక్ష్యం కధాని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు కోసం ఇంతత్యాగం చేస్తున్నా పేదప్రజలకు అధికారులుఇచ్చే బహుమతి ఇదే అని నిలదీశారు. పెండింగ్ లో ఉన్నఇంటి వ్యాల్యూషన్, రీవాల్యుయేషన్ పెట్టుకున్నవారికి ఒక్కరూపాయి తగ్గకుండా, రీసర్వేచేసి తక్షణమే అమౌంటు వాళ్ళ ఖాతాలోకి జమ చేయాలని, లేని పక్షంలో ఇదే నిర్వాసితు ప్రజలతో ఐ.టి.డి.ఏ ,ముందుధర్నాకు దిగుతామని హెచ్చరించారు. నిర్వాసితులకు ఇళ్లస్థలాలు కేటాయించడంలో విభజించి పాలిస్తున్న అధికారులు గ్రామసభలో ఎక్కువనిర్వాసిత కుటుంబాలు ఉంటే ఎక్కడ వారు కోరుకుంటే అక్కడేవాళ్లకి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టించి ఇవ్వాలి అంతేకానీ ప్రభుత్వం వాళ్లమధ్య విభేదాలు సృష్టించి, గందరగోళానికి తెరలేపుతున్నారని ఆయన మండి పడ్డారు.తక్షణమే వారు కోరుకున్నచోటనే స్థలం కేటాయించి ఇల్లుకట్టించాలని వారు డిమాండ్ చేశారు.18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ,కటాఫ్ డేట్ తో సంబంధంలేకుండా అర్హులైన ప్రతిఒక్కరికి ఆర్"అండ్"ఆర్, ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అధికారులు చేస్తున్న తప్పులవలన,చట్టాల ఉల్లం ఘనలవలన నిర్వాసిత కుటుంబాలకు రానున్నకాలంలో మరిన్ని సమస్యలు ఉత్పన్నంఅయ్యే పరిస్థితి. నెలకొందని ఆయన వాపోయారు. గిరిజనులలో ఓ.టి.ఎస్,ఆప్షన్ ఎంచుకోవడం ఇబ్బందులను కలుస్తుంది. గిరిజనులో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు కేవలంతమ వ్యక్తి గత ప్రయోజనాలను పరిగణించి అభిప్రాయాలు తెలియకుండా,పూర్తి గిరిజన సమూహ భవిష్యత్తు సురక్షితస్థానంలో ఉంచే నిర్ణయాలను తీసుకోవాల్సిన అవసరంఉందని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలపై కూటమి ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం

**సాగు, తాగునీరు విడుదల చేయకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తాం**

**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి హెచ్చరిక**



**నంద్యాల:ఆగస్టు=21ప్రజాజ్యోతి** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో రైతాంగం తీవ్ర దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నా కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపో వడం దారుణమని వైఎస్సార్సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మండిపడ్డారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతుంటే, సాగునీటి కోసం రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాల వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రాజెక్టులలో నీరున్నా కాలువలకు విడుదల ఏదీ? ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 875 అడుగుల వద్ద తగినంత నీటి నిల్వలు ఉన్నప్పటికీ, కాలువలకు లేదా రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందని విమర్శించారు. ప్రాంతీయ రిజర్వాయర్లలో నీటి మట్టాలు ఆందోళనకరంగా ఉన్నాయని గణాంకాలతో వివరించారు:

**వెలుగోడు రిజర్వాయర్: 17 టీఎంసీల సామర్థ్యానికి గానూ కేవలం 4 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి.**

**గోరుకల్లు రిజర్వాయర్: 12.5 టీఎంసీల సామర్థ్యానికి గానూ 6 టీఎంసీల నీరే అందుబాటులో ఉంది.**

**అవుకు రిజర్వాయర్: 4.5 టీఎంసీల సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం కేవలం 1 టీఎంసీ మాత్రమే ఉంది.**

**రాయలసీమకు తీరని ద్రోహం...**

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచి రాయలసీమను దశాబ్దాల కరువు నుండి కాపాడారని గుర్తుచేశారు. కానీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసి ప్రాంతానికి తీవ్రద్రోహం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం 800 అడుగుల నుంచే నీటిని తోడుకుంటున్నా, ఏపీ ప్రభుత్వం మన వాటా నీటిని సరిగ్గా వినియోగించుకోలేకపోతోందన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన ప్రతిసారీ రాష్ట్రం తీవ్ర కరువు కాటకాల బారిన పడుతుందని ఎద్దేవా చేశారు.

**యూరియా కోసం క్యూలైన్లు -- రైతులపై కేసులు..**

గత ఏడాది పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలైన రైతులకు, నేడు ఎరువులు, పురుగుమందుల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. యూరియా కోసం ఆన్‌లైన్ అప్లికేషన్లు పెట్టించడం, పంపిణీలో రాజకీయ రంగులు పులమడం సిగ్గుచేటన్నారు. మద్దతు ధర అడిగిన రైతులపై కేసులు పెట్టి జైళ్లకు పంపిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యమానికి సిద్ధం... నంద్యాల అర్బన్, రూరల్ పరిధిలోనే సుమారు 30 వేల ఎకరాల్లో పంటలు సాగు కావలసి ఉందని, వెంటనే నీటిని విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణ తాగునీటి అవసరాలు, మిట్నాల చెరువు నీటి ఎద్దడి తీర్చేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళిక ఏంటో స్పష్టం చేయాలన్నారు. తక్షణమే కాలువలకు నీటిని విడుదల చేయకపోతే, రైతులను సమీకరించి స్వయంగా వెళ్లి నీటిని విడుదల చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసీపీ డోన్ నియోజకవర్గం పరిశీలకుడు దేశం సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్ టి సెల్ సెక్రటరీ శంకర్ నాయక్, మధు మరియు పలువురు రైతు నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు






**హోళగుంద, ఆగస్టు 21, ప్రజా జ్యోతి న్యూస్ –** స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదోని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) బాలకృష్ణారెడ్డి,హోళగుంద ఎంపీడీఓ సయ్యద్ ఉమర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై మండలంలో అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల వివరాల పరిశీలన, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, ధృవీకరణ, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల మ్యాపింగ్ తదితర అంశాలను సమీక్షించారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేసి, నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించి ప్రచురించాలని డీడీఓ సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారు ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలో స్పష్టత ఉండేలా ప్రాంతాల వారీగా మ్యాపింగ్‌ను ఖచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో మరోసారి తనిఖీ చేసి ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, భద్రతా ఏర్పాట్లు వంటి మౌలిక వసతులను పరిశీలించాలని బాలకృష్ణారెడ్డి సూచించారు. ఓటర్లు, పోలింగ్ సిబ్బంది ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అవసరమైన సదుపాయాలను ముందుగానే కల్పించాలని తెలిపారు.పోలింగ్ ఏజెంట్లకు తగిన స్థలం, కూర్చునే సదుపాయాలు కల్పించడంతో పాటు పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, రాకపోకలకు అనుకూలత, ఓటర్లకు సౌకర్యవంతమైన వాతావరణం ఉండేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, నిష్పక్షపాతత్వం అత్యంత కీలకమని డీడీఓ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు నుంచి ఓటర్ల వివరాల ధృవీకరణ, మ్యాపింగ్, మౌలిక వసతుల కల్పన వరకు ప్రతి అంశాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి హోలగుంద మండలాన్ని ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమీక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యద్ ఉమర్, డిప్యూటీ ఎంపీడీఓ చక్రవర్తి, సంబంధిత మండల అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతములు

**ధర్మప్రచారంలో భాగంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు**

**సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన 1800 మంది పైగా భక్తులు వ్రతములో పాల్గొనవారందరికీ చీర, రవికవస్త్రం, వృక్ష ప్రసాదం అందజేత**

**వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం మరియు అన్న ప్రసాదాల ఏర్పాట్లు**



**నంద్యాల:శ్రీశైలం ఆగస్టు=21 ప్రజాజ్యోతి** వరలక్ష్మీవ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు (21.08.2026) దేవస్థానం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించింది. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణమండపంలో ఈ ఉచిత సామూహికవ్రతాలు నిర్వహించబడ్డాయి. 1800 మందికి పైగా భక్తులు ఈ వ్రతాన్ని జరిపించుకున్నారు.కాగా ఈ వ్రతాలకు కావలసిన పూజాద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చింది. వ్రతకార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికోసం వేరువేరుగా కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా ఈ వ్రతం జరిపించబడింది. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వ్రతంలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించబడింది. తరువాత వేదికపై వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.అనంతరం వరలక్ష్మీ వ్రతంలో భాగంగా భక్తులందరిచేత విడివిడిగా కలశస్థాపన చేయించి వరలక్ష్మీదేవివారిని సమంత్రకంగా ఆవాహన చేయడం జరిగింది. తరువాత శ్రీసూక్తవిధానంలో వ్రతకల్ప పూర్వకంగా వరలక్ష్మీదేవివారికి షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి. అనంతరం అర్చకస్వాములు వ్రతకథను పఠించి వ్రతమహిమావిశేషాలను భక్తులకు తెలియజేశారు. చివరగా నీరాజన మంత్రపుష్పాలను జరిపి వ్రతసమాప్తి చేయబడింది. వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ, చీర, రవికవస్త్రం, పూలు, గాజులు, కంకణాలు, వృక్షప్రసాదంగా తులసి మొక్క, పుస్తక ప్రసాదంగా శ్రీశైలప్రభ మాసపత్రిక, మూడు రకాల ప్రసాదాలు అందజేయబడ్డాయి.వ్రతానంతరం భక్తులందరికీ ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించబడింది. దర్శనానంతరం దేవస్థానం అన్నపూర్ణ భవనం నందు భక్తులందరికీ అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి.కాగా భక్తులందరూ వ్రతక్రియను సౌకర్యవంతంగా వీక్షించేందుకు వీలుగా చంద్రవతి కల్యాణమండపంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డి స్క్రీనును కూడా ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దంపతులు, ఆలయ అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ మన వైదికసంప్రదాయంలో శ్రావణ మాసాన వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించడం సంప్రదాయంగా వస్తున్నదని అన్నారు. ఈ శ్రావణమాసం సర్వదేవతా ప్రీతికరంగా చెప్పబడుతోందన్నారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా దేవస్థానం ఈ వరలక్ష్మీవ్రతాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. జ్యోతిర్లింగస్వరూపుడైన శ్రీమల్లికార్జునస్వామివారు మహాశక్తి స్వరూపిణి శ్రీభ్రమరాంబాదేవివారు స్వయంవ్యక్తంగా వెలసిన శ్రీశైలమహాక్షేత్రంలో వరలక్ష్మీవ్రతాన్ని జరిపించుకునే వారందరు కూడా ఎంతో అదృష్టవంతులన్నారు. అందరికీ శ్రేయస్సు కలుగుతుందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ధర్మకర్తల మండలి వారి సూచనల మేరకు భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. ( కార్యనిర్వహణాధికారి ఉత్తర్వుల మేరకు)శ్రీశైలదేవస్థానం వారి ద్వారా జారీ

# మత్తు పదార్థాలకు యువత దూరం కావాలి



**లక్ష్మీపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు**

**సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల అవగాహన**

**లక్ష్మీపురంలో ప్రజా అవగాహన సదస్సు**

**ఎటపాక, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):**యువత మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, విద్యపై దృష్టి సారించి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి. కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎటపాక మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మహిళలు, విద్యార్థుల భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం. కన్నపరాజు, ఎటపాక ఎస్ఐ జి. అప్పలరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వి. కృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో నేరాల నియంత్రణ, యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడంలో తల్లిదండ్రులు, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల సెల్‌ఫోన్ వినియోగంపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. మొబైల్ వ్యసనం, చెడు సావాసాల ప్రభావంతో విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపకుండా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని వివరించారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం**

గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎవరికీ ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, వ్యక్తిగత వివరాలను వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి**

విద్యార్థులు చెడు సావాసాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని పోలీసులు సూచించారు. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు పూర్తిగా దెబ్బతింటాయని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని అధికారులు కోరారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## కూతురు వివాహానికి ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలను ఆహ్వానించిన : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):** ఈనెల 30వ తేదీన గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం కుమార్తెకు మరియు అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కుమారుడకి వివాహం నిశ్చయించడం జరిగింది. ఈసందర్భంగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలను నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 30వ తారీకున జరగబోయే తన కూతురు వివాహానికి మీరందరు తప్పకుండ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిం చాలని వివాహ ఆహ్వాన పత్రికను అనంతపురం జిల్లా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సత్యసాయి జిల్లా ఎంపీ బి.కె పార్థసారథి, అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వర అందజేసి ఆహ్వానించడం జరిగింది.

## కేఈజయన్న78వజన్మదిన వేడుకలు,



**డోన్ ( ప్రజా జ్యోతి )ఆగస్టు 21,** నంద్యాల జిల్లా డోన్ టౌన్ నందుతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పిటిసికే.ఈ. జయ్యన్న78వ జన్మదిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ డోన్ శాసనసభ్యులు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కుమారుడుయువ నాయకులుకోట్ల రాఘవేంద్ర రెడ్డిమర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధముగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, సంద్రపల్లి లక్ష్మీనారాయణ యాదవ్, పనిరాజ్అయ్యా, రామాంజనేయులు యాదవ్, మాధవయ్యశెట్టి, వెంకటేశ్వర్లు, తదితర తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు,

## ఆళ్లగడ్డ నియోజవర్గం మెగా యూత్ ఫోర్స్ కమిటీ



**నంద్యాల ఆళ్లగడ్డ:ఆగస్టు=21 ప్రజాజ్యోతి** ఆళ్లగడ్డ నియోజవర్గం మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ పసుల నరేంద్ర ఆధ్వర్యంలో పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను మూడు రోజుల ప్రోగ్రాం ఈరోజు రెండవ రోజు ఈరోజు ఆళ్లగడ్డ గవర్నమెంట్ హాస్పిటల్ లో పేషెంట్లకు బెడ్డు పండ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో కేశవ. బావికాడి గురప్ప. భవాని శంకర్. బ్రహ్మేంద్ర కుమార్. తులసి. కోటి. చైతన్య. సచిన్. పెద్దఎత్తున పాల్గొన్నారు

## మడికిలో పోలీసుల పల్లె నిద్ర.. ప్రజలకు అవగాహన





**ఆలమూరు ఆగస్టు 21(ప్రజాజ్యోతి):**రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి.నరేష్ ఆధ్వర్యంలో మడికి గ్రామంలో గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే నేరాలు,డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు.గ్రామంలో ఎలాంటి గొడవలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

# ఎండి హళ్లిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు





ప్రజా సమస్యల పరిష్కారానికి జి. సుధాకర్ చొరవ

**హోళగుంద, ఆగస్టు 21,ప్రజా జ్యోతి న్యూస్**-మండలంలోని ఎండి హళ్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.మాజీ సర్పంచ్,ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ పాలకమండలి సభ్యులు జి. సుధాకర్ చొరవతో గ్రామంలోని ప్రధాన డ్రైనేజీలు, చిన్న కాలువలు, ఎల్ఎల్సీ కెనాల్ పూడికతీత పనులు చేపట్టారు.గ్రామంలోని లక్ష్మమ్మ అవ్వ గుడి నుంచి ఆర్అండ్బీ రోడ్డు వరకు, అలాగే ఆర్అండ్బీ రోడ్డు నుంచి పెద్దవంక వరకు పెద్ద డ్రైనేజీని తీయించారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలో కొత్త డ్రైనేజీలను ఏర్పాటు చేయించారు. గ్రామ పరిధిలోని ఎల్ఎల్సీ కెనాల్లో పూడికతీత పనులతో పాటు చిన్న కాలువలను కూడా శుభ్రం చేయించారు. ఈ పనులతో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపడుతుం దని స్థానికులు తెలిపారు. గ్రామ ప్రజలు సుధాకర్కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్కుమార్, ఎల్ఎల్సీ టీసీ మెంబర్ చంద్ర, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రభాకర్, శరణప్ప, దాసప్ప తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలు అభివృద్ధికి పవన్ కళ్యాణ్ మార్క్

## సూర్యుడు చెరువు వద్ద రూ.4.10 కోట్లతో వాకింగ్ ట్రాక్.. వాటర్ ట్యాంక్, డ్రైనేజీ పనులకు శ్రీకారం

## ప్రజల దశాబ్దాల కల సాకారం.. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు పరిశీలించిన జనసేన నాయకులు







**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ, ఆదేశాలతో గొల్లప్రోలు పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటున్నాయి. పట్టణ ప్రజల చిరకాల ఆకాంక్షలకు అనుగుణంగా సూర్యుడు చెరువు వద్ద సుమారు రూ.4.10 కోట్లతో ప్రతిష్టాత్మక వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దీనితో పాటు నూతన వాటర్ ట్యాంక్, డ్రైనేజీ తదితర పనులు కూడా కొనసాగుతుండటంతో పట్టణ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

### ఆరోగ్యానికి వాకింగ్ ట్రాక్

గొల్లప్రోలు పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న వాకింగ్ ట్రాక్ అవసరాన్ని గుర్తించి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని జనసేన నాయకులు తెలిపారు. సూర్యుడు చెరువు పరిసరాలను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో పనులు చేపట్టడం అభినందనీయమన్నారు.

వాకింగ్ ట్రాక్ పూర్తయితే ఉదయం, సాయంత్రం వేళల్లో వృద్ధులు, మహిళలు, యువతతో పాటు పట్టణ ప్రజలు సౌకర్యవంతంగా నడక సాగించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. చెరువు పరిసరాలు అభివృద్ధి చెందడంతో గొల్లప్రోలు పట్టణానికి కొత్త రూపురేఖలు సంతరించుకునే అవకాశం ఉందన్నారు.

### వాటర్ ట్యాంక్, డ్రైనేజీ పనులు

పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు కూడా ప్రారంభం కావడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పారిశుధ్య సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారని జనసేన నాయకులు తెలిపారు.

ఒకవైపు ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే వాకింగ్ ట్రాక్, మరోవైపు తాగునీటి అవసరాలను తీర్చే వాటర్ ట్యాంక్, పారిశుధ్యానికి కీలకమైన డ్రైనేజీ పనులు చేపట్టడం ద్వారా పట్టణ ప్రజల ప్రాథమిక అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.

### మాటల్లో కాదు.. చేతల్లో అభివృద్ధి

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కార్యరూపంలోకి తీసుకువస్తున్నారనడానికి గొల్లప్రోలు అభివృద్ధి పనులే నిదర్శనమని జనసేన నాయకులు అన్నారు. గతంలో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న ప్రజా అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి, అధికార యంత్రాంగంతో సమన్వయం చేస్తూ పనులు ప్రారంభించేలా పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపాలనే లక్ష్యంతో ప్రతి పట్టణం, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### పనులను పరిశీలించిన జనసేన నాయకులు

సూర్యుడు చెరువు వద్ద జరుగుతున్న వాకింగ్ ట్రాక్, వాటర్ ట్యాంక్, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను గొల్లప్రోలు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు ఆధ్వర్యంలో బస చిట్టిబాబు, బలిరెడ్డి గంగబాబు, తలారి శ్రీను తదితర నాయకులు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జనసేనాని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యంగా గొల్లప్రోలు పట్టణానికి అవసరమైన మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. ప్రజల చిరకాల కోరిక అయిన సూర్యుడు చెరువు వాకింగ్ ట్రాక్కు రూ.4.10 కోట్లతో పనులు ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మొగిలి వీరబాబు, వార్డు ఇన్చార్జిలు తలారి శ్రీనివాస్, బలిరెడ్డి నానిబాబు, పేకేటి సుబ్రహ్మణ్యం, నామాల రమేష్, మొగిలి రాజా, చేతులూరి అర్జున్ నాయుడు, అరిపి శీను, నందిపు రామకృష్ణ, లావా బాబు, తలారి కామరాజు తదితరులు పాల్గొన్నారు.సూర్యుడు చెరువు వాకింగ్ ట్రాక్, వాటర్ ట్యాంక్, డ్రైనేజీ తదితర పనులు ప్రారంభం కావడంతో గొల్లప్రోలు పట్టణ అభివృద్ధికి కొత్త ఊపు వచ్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ మద్దిలేటి స్వామి దేవస్థానంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం





**బేతంచెర్ల: ఆగస్టు21,(ప్రజా జ్యోతి)** బేతంచెర్లమండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం వైభవంగా ఆలయ ఉప కమిషనర్ ఎమ్. రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.వ్రతంలో భాగంగా స్వామివారితో పాటు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, విశేషంగా అలంకరించారు. అనంతరం ఉప కమిషనర్ ఎం. రామాంజనేయులు ఆయన సతీమణి తో కలిసి అమ్మవారి ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి, ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య విశేష ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పెద్ద సంఖ్యలో మహిళలు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలకు సౌభాగ్య కుంకుమార్చన నిర్వహించి, కళశం, శేష వస్త్రాలు, ప్రసాదం, కుంకుమ, గాజులను అందజేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మంగళవాయిద్యాల నడుమ సాగిన పూజా కార్యక్రమాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్యదఆయిల్ షాపు భూపాల్ ఆధ్యాత్మికానందాన్ని పొందారు.

## ఈరన్న స్వామి హుండీ లెక్కింపు



**కౌతాళం, ఆగష్టు 21 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి ఆలయం నందు శుక్రవారం రోజున హుండీ లెక్కించారు అందులో నగుదు 84,36,480/- అన్నదానం హుండీ .12,17,458/- రూపాయలు మొత్తం కలెక్షన్ 96,53,938/-రూపాయలు మలేషియా 1 రింగ్గిట్ - 6 మలేషియా 5 రింగ్గిట్ -2 బంగారం:6గ్రాములు 300మిల్లి గ్రాములు వెండి:13కేజీల 450 గ్రాములు 2026 శ్రావణమాసం ఉత్సవాల సందర్భముగా స్వామివారి హుండీ లెక్కింపు కార్యక్రమం దేవస్థానం డిప్యూటీ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి శ్రీమతి కె.వాణి ఆధ్వర్యంలో మరియు పాలకమండలి సభ్యులు ఆధ్వర్యంలో జరిగినది.ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి శ్రీ కె.కమలాకర్ 1స్ట్ గ్రేడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కర్నూల్, దేవస్థాన పర్యవేక్షకులు మరియు సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్,ఉరుకుంద సిబ్బంది మరియు శ్రీ భ్రమరాంభ సేవాసమితి ఆదోని వారు పాల్గొనియున్నారు.

## రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి.

-బూరుగుపూడిలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో టిడిపి నాయకులు.



**కాకినాడ జిల్లా ఆగస్టు 21(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధించడమే కాకుండా,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు సక్రమంగా అందుతున్నాయని కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామ టిడిపి నాయకులు అన్నారు.జగ్గంపేట ఎమ్మెల్యే,టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ,జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఆదేశాలతో రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సంక్షేమపై బూరుగుపూడి గ్రామ ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుంచే తాతాజీ,పాఠంశెట్టి నాగేశ్వరరావు,పాఠంశెట్టి విశ్వనాథం,బాలుకుల చిన్నోడు,మూరా సత్తిబాబు,వజ్రపు శేఖర్,పాటంశెట్టి గణేష్,బాలిన వెంకటేశ్వరరావు,పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గృహప్రవేశానికి హాజరైన వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద ఆచారి



**కౌతాళం ఆగష్టు 21 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో కురువ మర్రిస్వామి నూతన గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద ఆచారి ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాల్ దినకర్, మాజీ ఉపసర్పంచ్ సక్రి తిక్కయ్య, వడ్డె రాము,తాహిర్ వలి, వడ్డె చిన్న హుసేని మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మద్దిలేటి నరసింహ స్వామి సన్నిధిలో మంత్రి దంపతులు

శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు



**బేతంచెర్ల:ఆగస్టు21,(ప్రజా జ్యోతి)** శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని బేతంచెర్ల మండలంలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులు మద్దిలేటి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మంత్రి దంపతులకు ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు, వేద పండితులు, ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దంపతులు స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణంలో కొద్దిసేపు గడిపారు.పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మంత్రి దంపతులు ఆకాంక్షించారు. శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం భక్తజన సందడితో కళకళలాడింది.


## నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న సింగిల్ విండో అధ్యక్షులు వెంకటపతిరాజు, మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు



**కౌతాళం,ఆగష్టు 21 ప్రజా జ్యోతి** శుక్రవారం రోజున మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం మండల కేంద్రం నందు తెదేపా కుటుంబ సభ్యులు జుమ్మలదిన్నె వారి నూతన గృహ ప్రవేశ ఆహ్వానం మేరకు హాజరై నూతన గృహంలో ఆనందం,ఐశ్వర్యం మరియు సుఖశాంతులు నిండాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తూ,కుటుంబ సభ్యులకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సౌద్రి బసవరాజు, కురువ వీరేష్, పట్టణ అధ్యక్షులు డా”రాజనందు తెలుగు యువత గొట్టయ్య,నభీ,జుట్ల నాగరాజు, మర్రెగౌడ ,నాగరాజు, మౌనేశ్ మొదలగు తెదేపా కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగినది

## మహాలక్ష్మీ నమోస్తుతే...

**- భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు**




**పొందూరు ప్రజాజ్యోతి న్యూస్ :** రెండవ శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ దేవి వ్రతం సందర్భంగా పొందూరు మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయంలో కొలువుదీరిన శ్రీ మహాలక్ష్మీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవిల్లి గిరిశర్మ వేకువజామున నుండే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు కుంకుమార్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. దీంతో ఆ ప్రాంగణం అంతా ఓం శ్రీ మాత్రే నమః అనే నామస్మరణతో మారుమ్రోగింది.

## బీసీల రిజర్వేషన్ పెంపు పట్ల బీసీ వర్గాలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మంత్రి నిమ్మల రామానాయుడు.**





**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగష్టు 21.** కూటమి ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ పెంపు పట్ల బీసీ వర్గాలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పాలకొల్లులో కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులలో 27వ వార్డు నందు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ టిడ్కో ఇళ్ళు డా.అబ్దుల్ కలాం శంభునిచెరువు పార్క్ కుళాయి చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి అభివృద్ధి పనులకు సంబంధించి తగు సూచనలు చేశారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తుందనడానికి, స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్ పెంపు నిదర్శనమన్నారు. మున్సిపాలిటీల్లో 33శాతం, పంచాయితీల్లో పై 34 శాతం పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని మంత్రి నిమ్మల తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకే, 24.15 శాతం రిజర్వేషన్ నుంచి 34 శాతానికి పెంచటం జరిగిందన్నారు.గత వైసిపి ప్రభుత్వం లో 34 శాతం ఉన్న రిజర్వేషన్ 24 . 15శాతానికి తగ్గించి బీసీలకు జగన్ ద్రోహం చేశారన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్ తగ్గడంతో 16,800 పోస్టు కోల్పోయారన్నారు.అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు అంశం పై, మద్దతు తెలపని జగన్ .బీసీల వ్యతిరేకి అని మంత్రి నిమ్మల అన్నారు. టిడిపి అంటేనే బీసీ అని బీసీ అంటేనే టిడిపి అని బీ అందువలనే బిసీలకు టిడిపి ప్రభుత్వంలోనే, ఎన్టీఆర్ తొలిసారిగా స్థానిక సంస్థల్లో 20శాతం రిజర్వేషన్ ఇచ్చి, రాజకీయ అవకాశాలు కల్పించారని అన్నారు. బీసీలకు 20 శాతం ఉన్న రిజర్వేషన్, 34 శాతానికి పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, సామాజిక న్యాయం దిశగా నిర్ణయం తీసుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బీజేపీ నాయకులు ఉన్నమట్ల కపర్ధి జక్కంపూడి కుమార్ టీడీపీ నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, కె గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లా జమియత్ అహ్లె హదీస్ నూతన కార్యవర్గం ఎన్నిక



**హోళగుంద, ఆగస్టు 21, ప్రజా జ్యోతి న్యూస్ –** కర్నూలు జిల్లా జమియత్ అహ్లె హదీస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర శాఖకు సంబంధించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు మొత్తం 19 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా ఖాజీ ముతహిర్ జామయీ హఫిజహుల్లాహ్, ఉపాధ్యక్షులు–1గా అబ్దుల్లా, ఉపాధ్యక్షులు–2గా అబ్దుల్ రజాక్, జనరల్ సెక్రటరీగా హాఫిజ్ మంజూర్, జాయింట్ సెక్రటరీ–1గా అబ్దుల్ రెహ్మాన్ ఉమ్రి, జాయింట్ సెక్రటరీ–2గా ముస్తాక్, ట్రెజరర్‌గా అబ్దుల్ జలీల్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 12 మంది మజ్లిసే ఆమిలా సభ్యులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జమియత్ బాధ్యులు, సభ్యులు మాట్లాడుతూ.. నూతన కార్యవర్గ నాయకత్వంలో షెహెరి జమియత్ అహ్లె హదీస్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో దీని, దావత్, విద్య, సంస్కరణ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి సమాజానికి సేవలందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.నూతనంగా ఎన్నికైన బాధ్యులు మాట్లాడుతూ.. జమియత్ ఆశయాలు, నియమ నిబంధనలకు అనుగుణంగా తమకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీ, అంకితభావం, ఇఖ్లాస్‌తో నిర్వర్తిస్తామని తెలిపారు. ఖుర్‌ఆన్, సున్నత్ సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు జమియత్ అభివృద్ధికి, సమాజ సేవకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.నూతన కార్యవర్గ ఎన్నికతో కర్నూలు జిల్లా జమియత్ అహ్లె హదీస్ కార్యకలాపాలకు మరింత ఊపు లభిస్తుందని సభ్యులు ఆకాంక్షించారు.

# గొల్లప్రోలులో వైభవంగా వరలక్ష్మీ వ్రత పూజలు

### విజయదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** శ్రావణ మాస మహోత్సవాల్లో అత్యంత పవిత్రమైన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గొల్లప్రోలు పట్టణంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన వెలిసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయం భక్తుల కోలాహలంతో పోటెత్తింది. శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు, ముఖ్యంగా మహిళలు ఆలయానికి తరలివచ్చారు.వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు తెల్లవారుజాము నుంచే ఆలయంలో , ప్రత్యేక అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దర్శనమిచ్చిన విజయదుర్గమ్మను చూసి భక్తులు పులకించిపోయారు.ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద సంఖ్యలో కూర్చుని వరలక్ష్మీ వ్రత కల్ప పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తోరాలు ధరించి, అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. తమ ముత్తైదువ తనాన్ని కాపాడాలని,





ఇంటా బయటా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధించాలని మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

**సందడిగా మారిన ఆలయ పరిసరాలు**

భక్తుల రాకతో గొల్లప్రోలు మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల క్యూ లైన్లు నిరంతరాయంగా సాగాయి. పూజలు ముగించుకున్న అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు, వాలంటీర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రావణ శుక్రవార మహోత్సవంతో గొల్లప్రోలు పట్టణమంతా ఆధ్యాత్మిక మురిపెం చాటుకుంది.

# ఇంటింటి కార్యక్రమాల్లో భాగంగా మారుమూల పంచాయతీల గిరిజన గ్రామాలలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ విస్తృత పర్యటన





**అనంతగిరి మండలం. ఆగస్టు 21. ప్రజా జ్యోతి న్యూస్.** రిపోర్టర్ శంకర్ అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. అనంతగిరి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర ఆధ్వర్యంలో జీనవాడు.పినకోట పంచాయతీల గిరిజన గ్రామాలలో ఇంటింటి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ శుక్రవారంనాడు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు తమ ప్రధాన సమస్యలను కిడారి శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రహదారి సౌకర్యం, పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.పాఠశాల భవనం సమస్యపై ఎస్.ఎస్. ఏ. పి ఓ తో ఫోన్‌లో మాట్లాడిన శ్రావణ్ కుమార్, పాఠశాలను పరిశీలించి వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వంజంగి గ్రామస్తులు రహదారి సౌకర్యం కల్పించాలని కోరగా, ట్రైబల్ వెల్ఫేర్ ఏ.ఈతో ఫోన్‌లో మాట్లాడి సోమవారం లోగా రహదారి నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేషన్ సిద్ధం చేసి పంపించాలని సూచించారు. గ్రామస్థులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి నేటికి 80.సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు మా గ్రామానికి ఏ రాజకీయ నాయకుడు రాలేదని తొలిసారిగా మీరు మా గ్రామానికి వచ్చి ఇంటింటికీ తిరిగి మా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. మీ తండ్రి, గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన స్వర్గీయ కిడారి సర్వేశ్వరరావు మా గ్రామ సమస్యపై ఫోన్‌లో మాట్లాడి మాయి దాయర్తి గ్రామానికి రహదారి మంజూరు చేయించారని గుర్తు చేశారు.అయితే ఆయన మరణానంతరం వై.సీ.పీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారి పనులు నిలిచిపోయాయని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతంరహదారి పనులను తిరిగి ప్రారంభించి, గ్రామానికి పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యం కల్పించాలని కిడారి శ్రావణ్ కుమార్‌ను కోరారు. దీనిపై స్పందించిన కిడారి గతంలో మంజూరైన రహదారి పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజన ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు కూటమి ప్రభుత్వం అమలుపరిచిన సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అందుతున్నాయని ప్రజలు తెలియపరచడంతో చైర్మన్ ఆనందం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో ఏ. బుజ్జిబాబు లక్ష్మణ్, సుందర్ రావు, దేముడు డి. శ్యామ్, నిర్మల,గండి సురేష చంటి, నాగేష్, శ్యామ్, ఆనంద్, లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వరలక్ష్మి వ్రత మహోత్సవ వేడుకలు

**బ్రహ్మంగారిమఠం– ప్రజా జ్యోతి ఆగష్టు 21** మండల కేంద్రంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం ప్రాంగణంలో మఠాధిపతులు వీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యములో మొట్ట మొదటి సారిగా శ్రీ వరలక్ష్మీ వ్రతం పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు మఠాధిపతులు వీరధర్మజ వేంకటాద్రి స్వామి వారి ధర్మపత్ని ఉమాదేవి ఆయన సోదరులు దత్తాత్రేయ స్వామి వారి ధర్మపత్ని రాధ సతీ సమేతంగా పూజలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమానికి స్థానిక మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సామూహిక కుంకుమార్చనలు,అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన స్థానిక పెద్దలకు, మఠాధిపతులు వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు.దుశ్శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు.



పూజా కార్యక్రమాలు అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మునుపు ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

# నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన మాజీ జడ్పీ విపక్షనేత కరణం రామ్మోహన్ చౌదరి





**కంబదూరు ఆగస్టు 21:(ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్ ఖాన్,**కంబదూరు మండల పరిధిలోని మరి మాకులపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బోర్ల మల్లికార్జున, సోదరుడు పూజారి ఈరన్న ఆహ్వానం మేరకు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన మాజీ జడ్పీ విపక్ష నేత కరణం రామ్మోహన్ చౌదరి, కి వారి కుటుంబ సభ్యులు ఆత్మీయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతన గృహంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, జీవించాలని రామ్మో హన్ చౌదరి, ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి దేవిగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారు







**చాగలమర్రి, ఆగస్టు 21( ప్రజాజ్యోతి న్యూస్);** చాగలమర్రిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు పుల్లేటి కుర్తి రాధాకృష్ణ విశేష పూజలు జరిపించారు. మహిళలందరూ అమ్మవారిని వరలక్ష్మి దేవిగా అలంకరించి విశేష పూజలు జరిపించారు. ఉభయదారులుగా పసుపుల నాగరాజు ధర్మపత్ని నాగజ్యోతి పసుపుల సునీల్ కుమార్ ధర్మపత్ని సింధూరి నాగ యశిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ, ధర్మకర్త వంకదార లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# 90.శాతం వైకల్యం ఉన్నా అందని పించన్

## అధికారుల చుట్టూ నాలుగేళ్లుగా వికలాంగురాలు వితంతువు పింఛన్ కోసం ఆరాటం.

## రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ శ్రావణ్ కుమార్ ను కలిసి ఆదుకోవాలని వినతి.

**అనంతగిరి మండలం. ఆగస్టు 21. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం పినకోటపంచాయతీ పరిధి వాంజంగి గ్రామానికి చెందిన గమ్మెల జమలమ్మ 44. సంవత్సరాలు గిరిజన మహిళ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది శుక్రవారం మండలంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటిప్రచార కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మలమ్మ ఆయనను కలిసి తన దీన స్థితిని వివరిస్తూ వినతిపత్రం అందజేసింది.తన భర్త గెమ్మెల బాలన్న నాలుగు సంవత్సరాల క్రితం మరణించారని జమ్మలమ్మ తెలిపారు. వికలాంగురాలు అయిన తను భర్త చనిపోయినప్పటి నుండి వితంతు పింఛన్ కోసం మండల పరిషత్ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల చుట్టూ దరఖాస్తులు పట్టుకుని ప్రదక్షిణలు చేస్తున్నా నేటికీ ఫలితం లేదని కన్నీరుమున్నీరయ్యారు.



**90. శాతం వైకల్యం ఉన్నాను**

మరోవైపు తాను శారీరక వైకల్యంతో బాధపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌లో తనకు 90.శాతం వికలాంగత్వ పరిస్థితి ఉన్నట్లు స్పష్టంగా చూపిస్తున్నప్పటికీ, విభిన్న ప్రతిభావంతుల పింఛన్ కూడా మంజూరు కావడం లేదని వాపోయారు. ఇంతటి తీవ్ర వైకల్యం కళ్లముందు కనిపిస్తున్నా పింఛన్ ఇవ్వకపోవడం పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమేనని‌ఆమె కన్నీరు మున్నీరు అయ్యారుమానవత్వంతో స్పందించి తనకు తక్షణమే పింఛన్ అందేలా చూడాలని ఆమె జీ.సీ.సీ చైర్మన్‌ను వేడుకున్నారు. దీనిపై స్పందించిన కిడారి శ్రావణ్ కుమార్ బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# సురరాగ నాటక కళాసమితి శిక్షణాలయంలో పాల్గొన్న డి.ఆర్.ఓ మాలోల

**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల స్వరరాగ నాటక కళా సమితి శిక్షణాలయంలో శుక్రవారం జిల్లా రెవెన్యూశాఖ అధికారి (డిఆర్ఓ) మలోల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సంస్కృతి, సాంప్రదాయం లోభాగంగా ప్రధానమైన భూమిక ను నిర్వహిస్తున్నది సాంప్రదాయ సంగీత పౌరాణిక రంగస్థలం నాటకాలన్నారు. నేను కూడా ఒక కళాకారుడినే రంగస్థల పౌరాణిక నాటకాల యందు శ్రీకృష్ణసత్యలో కృష్ణుడుగా,పాన్పుసీనులో దుర్యోధనుడుగా, బాలనాగమ్మలో కార్యవర్ధిరాజుగాను నటించానని, ఈ కళల వల్ల శరీరకంగాను, ఆరోగ్యపరంగాను, ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. రాగాలు పాడితే రోగాలు ఉండవు అన్న విషయం సత్యం అన్నారు. ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సంగీతదర్శకులు యం.దేవరాజ్, అలాగే గౌరవ అధ్యక్షుడు, సీనియర్ కళాకారుడు పాత్రికేయుడు అయిన పుంజా కృష్ణారావు ఆహ్వానం మేరకు వరలక్ష్మీవ్రతం పండుగ పర్వదినం సందర్భంగా స్వరరాగ నాటక కళా సమితి శిక్షణాలయంలో ఆ సమతి కళాకారులతో గడపడం ఒక భాగ్యముగా భావిస్తున్నాను. ఈసందర్భంగా డిఆర్ఓ మలోలకు కళాసమితి వారు ఘనంగా సన్మానం చేశారు. అలాగే సీనియర్



కళాకారులు పాత్రికేయుడైన పంజా కృష్ణారావుకు ఘణసన్మానం చేసి సత్కరించారు. కళాకారులతోపాటు ఆయన కూడా పాటలు పద్యాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో మైకేల్ బాబు,ఎం దేవరాజు, పుంజా కృష్ణరావు, నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, బ్రహ్మయ్య, చీమల తిరుపాలు, హనుమంతరెడ్డి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# నంబర్ ప్లేట్లు సక్రమంగా ఉండాలి..

# హెల్మెట్ తప్పనిసరి-సీఐ ఎన్ రమేష్

--ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించిన ట్రాఫిక్ 1 పోలీసులు



**కాకినాడ జిల్లా ఆగస్టు 21(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కాకినాడ నగరంలో ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ 1 పోలీసులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎం కిషోర్ కుమార్ సారథ్యంలో ట్రాఫిక్-1 సీఐ ఎన్ రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అవగాహన కల్పించారు.వాహనదారులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని,ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాహనాలకు ఉపయోగించాలని పోలీసులు స్పష్టం చేశారు.నంబర్ ప్లేట్లు వాహనం ముందు,వెనుక భాగాల్లో స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.నంబర్ ప్లేట్‌పై అంకెలను మార్చడం,చెరిపివేయడం,వంకరగా చేయడం లేదా అస్పష్టంగా కనిపించేలా చేయడం వంటివి చేయకూడదన్నారు.ఫ్యాన్సీ, స్టైలిష్,అక్రమ నంబర్ ప్లేట్లతో పాటు పేర్లు,స్టిక్కర్లు,ఇతర గుర్తులను నంబర్ ప్లేట్లపై ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు.నంబర్ ప్లేట్‌ను ఉద్దేశపూర్వకంగా దాచడం,మార్చడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధించనున్నట్లు హెచ్చరించారు.మోటార్ వాహనాల చట్టం ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై జరిమానాలు విధించనున్నట్లు పోలీసులు తెలిపారు.వాహనదారులు తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ 1 సీఐ ఎన్ రమేష్,ఎస్ఐ సి హెచ్ బోసుబాబు,ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ సైనిక ఉద్యోగితో గొడవ.. విశాఖ మహిళ శవమై తేలిన వైనం!

**పొరుమామిళ్ల వైఎస్సార్ కడప జిల్లా ఆగస్టు 21 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** క్షణికావేశం ఒకరి ప్రాణం తీయగా.. మరొకరి జీవితాన్ని అంధకారంలోకి నెట్టింది. మనస్పర్థలతో విడిపోయి, కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకున్న ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన పొరుమామిళ్లలో తీవ్ర కలకలం రేపింది.సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖ పట్నం ప్రాంతానికి చెందిన ఓ మహిళకు గతంలో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. మనస్పర్థల కారణంగా మొదటి భర్తతో విడాకులు తీసుకున్న ఆమె, రిటైర్డ్ మాజీ సైనిక ఉద్యోగిని రెండో వివాహం చేసుకుంది అయితే, వీరిద్దరూ కలిసి ఒకే చోట ఉండకుండా.. అప్పుడప్పుడు



పొరుమామిళ్లకు వచ్చి వెళ్తుండేవారు.ఈ క్రమంలో ఈరోజు వీరిద్దరి మధ్య ఏదో విషయంలో తీవ్రస్థాయిలో గొడవ జరిగినట్లు తెలుస్తోంది. మాటమాట పెరగడంతో ఆగ్రహానికి గురైన వ్యక్తి ఆమెపై దాడి చేయడంతో సదరు మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. పోలీసుల సమాచారం అందుకున్న వెంటనే పొరుమామిళ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, అసలు హత్యకు గల బలమైన కారణాలు ఏమిటి? గొడవకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? అనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నారు.

# లక్ష్మీపురం పీహెచ్‌సీకి బెడ్‌షీట్లు, పిల్లో కవర్ల వితరణ

పేదలు, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందాలి

ప్రభుత్వ ఆసుపత్రులకు సహకారం సామాజిక బాధ్యత

జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్





**ఎటపాక, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి):** పేదలు, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటికి అవసరమైన సహకారం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, చింతూరు మండల టీడీపీ అధ్యక్షుడు మొహమ్మద్ జమాల్ ఖాన్ పేర్కొన్నారు. జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎటపాక మండలం లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) శుక్రవారం బెడ్‌షీట్లు, పిల్లో కవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతాల్లోని నిరుపేదలు, గిరిజనులు అత్యవసర వైద్య సేవల కోసం ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడతారని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ సామగ్రిని అందజేసినట్లు వివరించారు. రోగులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో విద్య, వైద్యం, పేదల సంక్షేమం వంటి రంగాల్లో సేవలను మరింత విస్తరిస్తామని వెల్లడించారు. ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని అందజేసిన జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విశ్వచైతన్య, డాక్టర్ రాజశేఖర్, ఎటపాక మండల టీడీపీ కార్యదర్శి కణితి మధు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఉండేటి రమేష్, ఉండేటి వెంకన్న, కొట్టే వెంకయ్య, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ అన్ని విధాలుగా శుభ్రపడాలంటే.. పంచాయతీ సెక్రటరీగా బసవలింగేశ్వరరావు కావాలి..!!

## పలువురు గ్రామ ప్రజలు వేడుకోలు...!

**జి.కొండూరు :( ఆగస్టు 21,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):**సహజంగా గ్రామపంచాయతీలు శుభ్రంగా ఉండాలన్న,మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్న, గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామ సర్పంచ్ తో పాటు, ప్రధానంగా గ్రామపంచాయతీ సెక్రటరీకి ప్రధాన భాద్యత ఉంటుంది. కొందరు గ్రామపంచాయతీ సచివాలయ సెక్రటరీ నీతి–నిజాయితీతో వారి విధులు నిర్వహిస్తూ ఉంటారు. గ్రామాన్ని అన్ని విధాలుగా శుభ్రపరచడంలో... అభివృద్ధి చేయడంలో. వారు విధులను ముక్కుసూటిగా వ్యవహరిస్తూ... గ్రామ మండల స్థాయి నాయకులు ఒకరు,ఇద్దరు వ్యతిరేకించిన వారి...వారి విధానాలను నీతి –నిజాయితీతో అమలు చేస్తూ ఉంటారు. మరికొందరు గ్రామపంచాయతీ సెక్రటరీలు గ్రామ అభివృద్ధిని పట్టించుకోకుండా, గ్రామ విధులు శుభ్రపరచ కుండా, గ్రామ ప్రజలకు తాగునీరు అందుతుందా..? లేదా..? డ్రైనేజీలు శుభ్రంగా ఉన్నాయా...?లేదా...? అనే సమస్యలను మరిచిపోయి డ్యూటీ కి వచ్చామా... లేదా పోయామా.... లేదా... నెల, నెల జీతం తీసుకుంటున్నామా లేదా...? అనే రీతిలో కొందరు సెక్రటరీలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ ఉంటారు. వాస్తవంగా చెప్పాలంటే నీతి– నిజాయితీతో విధులు నిర్వహించే సెక్రటరీలను గ్రామస్థాయి మండల స్థాయి నాయకులకు నచ్చలేదని ఆ సెక్రెటరీ పై,పై నాయకత్వానికి ఫిర్యాదులు చేస్తూ, మంచిగా పని చేసే సెక్రటరీలను ఒక చోట నుండి మరొకచోటకు మారుస్తూ... పైశాచిక ఆనందం పొందుతూ ఉంటారు. ఉదాహరణకు మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామపంచాయతీ సెక్రటరీ బసవలింగేశ్వరరావు నీతి –నిజాయితీతో సక్రమంగా బాధ్యతలు నిర్వహిస్తుంటే... అతనిని మరొక చోటకు బదిలీ చేయడం తగదని గ్రామ ప్రజలు పలువురు బహిరంగనే ఆరోపిస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు జి.కొండూరు గ్రామపంచాయతీ సెక్రటరీగా బసవలింగేశ్వరావు గ్రామ నివాసితులకు తాగునీరు సక్రమంగా పంపిణీ జరపడంలో శ్రద్ధ వహించారని అలాగే అక్రమంగా మోటర్లు పెట్టి పైపులు ద్వారా త్రాగు నీటిని వృధా చేస్తున్న వారి మోటర్లు నిలుపుదల చేసి, ప్రతి ఒక్కరికి నీరు అందే విధంగా నీరు వృధా కాకుండా,తగు చర్యలు తీసుకున్నారని అలాగే గ్రామ విధుల్లో డ్రైనేజీలు శుభ్రంగా ఉన్నాయా...? లేదా...? లేకపోతే పూడికలు తీయించడం చేసేవారని అలాగే దోమ మందును చల్లిస్తూ నీరు నిల్వ లేకుండా...తగు జాగ్రత్తలు తీసుకుంటూ బాధ్యతగా విధులు నిర్వహించారని అలాగే గ్రామ ప్రయాణికులు ఎండ– వానకు బాధ కలగకుండా పంచాయతీ కార్యాలయం వద్ద సొంత ఖర్చులతో పట్టాలు కట్టించారని అలాగే హిందూ స్మశాన వాటికలో చేతి బోరు పంపులు నిర్మించారని,తాగునీరు వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరుస్తూ.. ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా కాపాడారని అలాగే ప్రధాన రహదారి వెంట పెరిగిన ముళ్ళ చెట్లను చెత్త చెదారం ను సిబ్బందితో చెట్లను తొలగించి పంచాయతీ నిధులు వచ్చినా...రాకపోయినా సొంత ఖర్చులు పెట్టి శుభ్రపరిచారని అలాగే పంచాయతీ సిబ్బంది సైతం బసవలింగేశ్వరావు పని బాధ్యతను మెచ్చుకుంటున్నారని గ్రామ ప్రజలు బహిరంగా నే చెబుతు న్నారు. పనిచేసే నాయకుడి మీద ప్రభుత్వ అధికారుల మీద కొంతమందికి బురద చల్లటం అలవాటేనని అంతమాత్రాన సెక్రెటరీ పై ఏదో ఒక అభియోగం మోపి బదిలీ చేయడం




తగదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే సెక్రెటరీ బసవలింగేశ్వరరావు ను మార్చిన తర్వాత ఇద్దరు సెక్రెటరీలు మారారని,మారిన సెక్రటరీ వలన గ్రామం ఏ విధంగా శుభ్రపడటం లేదని, డ్రైనేజీ సమస్య తాగునీటి సమస్య గ్రామాల లో తీవ్రంగా ఉందని వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల వల్ల ఇలాంటి సమస్యలే కొనసాగితే... ప్రజల్లో పాలక పార్టీ పై వ్యతిరేకత వస్తుందని,కావున ప్రజా బాంధవుడు శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ జి. కొండూరు కి సెక్రటరీగా బసవలింగేశ్వరరావునే ఉంచాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

### ప్రజాపాలనలో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన శాశ్వత భవనాలు

# ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు



**జగిత్యాల** దశాబ్దాలుగా అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే పరిపాలన కొనసాగుతూ వస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పొంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఇదే పరిస్థితి. గత పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన పాలకులు వీటిని పట్టించుకున్న పాపనపోలేదు. దీంతో పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు వేగవంతమైన, మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించాలనే గొప్ప సంకల్పంతో సమీకృత శాశ్వత భవనాలే పరిష్కార మార్గమని నూతన ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు ప్రజాప్రభుత్వం శ్రీకారంచుట్టిందని అన్నారు. అందులో భాగంగా ఈరోజు జగిత్యాల జిల్లాలో సహచర మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎమ్మెల్సీ ఎల్ రమణ , ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు , జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పలు ప్రభుత్వ నూతన కార్యాలయాల భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల మున్సిపాలిటిలో రూ. 2.25 కోట్లతో నిర్మించనున్న ఆర్డీఓ కార్యాలయం, రూ. 2.25 కోట్లతో మెట్పల్లి మున్సిపాలిటిలో నిర్మించే ఆర్డీఓ కార్యాలయం, అదేవిధంగా రూ. 2.25 కోట్లతో ఎండపల్లిలో, రూ. 2.25 కోట్లతో భీమారం లో నిర్మించనున్న తహసిల్దార్ కార్యాలయాలతో పాటు రూ. 1.40 కోట్లతో ముత్యంపేటలో నిర్మించనున్న మల్యాల సబ్రిజిస్ట్రార్ కార్యాలయం, రూ. 1.40 మెట్పల్లి సబ్రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఇప్పటికే హైదరాబాద్ ఉఊఓఅ పరిధిలో అత్యంత అధునాతన హంగులతో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వీటిని కూడా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంతరి సూచించారు.

# ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతులపై కాంగ్రెస్ అనవసర రాజకీయం మానుకోవాలి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రానీచందర్ రావు**

**హైద్రాబాద్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రానీచందర్ రావు మాట్లాడారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతుల వ్యవహారంతో పాటు మెడికల్ విద్యార్థుల ఫీజుల సమస్యలపై ఆయన కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**బీజేపీలోకి ప్రముఖ వైద్యుల చేరిక:**

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ పోస్ట్ గ్రాడ్యుయేట్, క్యాన్సర్ రిహాబిలిటేషన్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ విజయేందర్ , అలాగే ఎల్బీ నగర్ మేఘనా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రమోద్ ఎన్. రామచందర్ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కమిటీలను నిర్మించి విశేష సేవలందిస్తున్న డాక్టర్ విజయేందర్ , తోటి వైద్యులందరి మద్దతును బీజేపీకి సమీకరిస్తూ పార్టీలో చేరడం ఎంతో శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.

**ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతులపై స్పష్టత:**

ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఓఇం) పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వకపోవడం వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదని ఎన్. రానీచందర్ రావు స్పష్టం చేశారు. సీఎంతో పాటు వెళ్లే అధికారుల ప్రతినిధి బృందానికి పెట్టుబడులు, ఒప్పందాల కోసం సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇప్పటికే కేంద్రం అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధంగా ముఖ్యమంత్రులు లేదా మంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లే సమయంలో ఆ పర్యటన అధికారిక ఆవశ్యకత, ఆహ్వానించిన సంస్థల నేపథ్యం, హాజరయ్యే వ్యక్తుల స్థాయి, అంతర్జాతీయ ప్రోటోకాల్, డిప్లొమాటిక్ అంశాలు, భద్రతా ఏర్పాట్లు, ఎఫ్‌సీఆర్ఏ (ఈఅఖీం) నిబంధనలు తదితర కీలక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తర్వాతే విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2012లో నాటి అస్సాం కాంగ్రెస్ ముఖ్యమంత్రి తరుణ్ గొగొయ్ అమెరికా, ఇజ్రాయెల్ పర్యటనలను, అలాగే జార్ఖండ్ నాటి బీజేపీ సీఎం అర్జున్ ముండా



థాయిలాండ్ పర్యటనను కేంద్రం తిరస్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంతేకాకుండా నాడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ కి అమెరికా వీసా రాకుండా కాంగ్రెస్ ఎంపీలు, నాయకులు కుట్రపూరితంగా లేఖలు రాసిన చరిత్రను గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు కేంద్రం ఎలాంటి అడ్డంకులు సృష్టించలేదని, తాజా పర్యటనకు సంబంధించిన నిబంధనలు, విధివిధానాల లోపాల ప్రకారమే నిర్ణయం జరిగిందని, దీనిని రాజకీయం చేయవద్దని హెచ్చరించారు

**ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజు దోపిడీపై ఆగ్రహం రీఫండ్‌కు డిమాండ్:**

నీట్ ద్వారా ప్రవేశాలు పొందిన ఎంబీబీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి ప్రైవేట్ మెడికల్ కాలేజీలు అక్రమంగా ఫీజులు వసూలు చేయడంపై శ్రీ ఎన్. రానీచందర్ రావు గారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగున్నర సంవత్సరాల కోర్సు ఫీజును ఐదు వాయిదాలలో చెల్లించాలని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (ంంఈఖీఅ) నిర్దేశించినప్పటికీ, కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్ల పూర్తి ఫీజును వసూలు చేస్తూ ఒక్కో విద్యార్థి కుటుంబంపై ?13 లక్షల నుండి ?20 లక్షల వరకు అదనపు భారం మోపాయని మండిపడ్డారు. విద్యార్థుల నుండి అదనంగా వసూలు చేసిన ఫీజులను వెంటనే వాపస్ చేయాలని టీఏఎఫ్ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ గోపాల్ రెడ్డి తో పాటు హైకోర్టు కూడా స్పష్టమైన తీర్పులిచ్చాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఆఓఇ) తక్షణమే జోక్యం చేసుకుని ఆయా ప్రైవేట్ కళాశాలల నుంచి విద్యార్థులకు ఫీజులు రీఫండ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుల పక్షాన బీజేపీ నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని డిమాండ్ చేశారు.

## భక్తిశ్రద్ధలతో కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

– సామూహిక కుంకుమార్చనలు,మణిద్వీప వర్ణన పారాయణ



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** పొందూరు మండల కేంద్రంలో మార్కెట్ ఆవరణంలో వెలసియున్న శ్రీ కోదండ రామాలయంలో శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు జగన్నాధాచార్యులు వేద మంత్రాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లలితా గ్రూప్ సభ్యులు సామూహిక కుంకుమార్చన , మణిద్వీప వర్ణన పారాయణ చేస్తూ 36 గాజులతో పూజ జరిపించారు. రెండవ శుక్రవారం వరలక్ష్మీ దేవి వ్రతం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## వెట్టి చాకిరీ నుంచి ఆరుగురికి విముక్తి




**కంబదూరు, ఆగస్టు 21:(ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండలంలోని రాంపురం గ్రామంలో రెండు కుటుంబాలు పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను రెవెన్యూ అధికారులు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించారు. ఆర్డీఓ వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు రాంపురం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు కార్మికులను గుర్తించి, వారి వివరాలను సేకరించారు. వీరంతా మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లా ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. అనంతరం అధికారులు ఆరుగురు కార్మికులను సురక్షితంగా వారి స్వస్థలానికి తరలించారు. కార్మికులను బలవంతంగా పనిలో పెట్టుకోవడం వెట్టి చాకిరీ చేయించడం చట్టవిరుద్ధమని అధికారులు తెలిపారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెట్టి చాకిరీకి సంబంధించిన సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

## చొప్పెల్ల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి సుంకర పోలిశ్వరావు (పోలీస్),కనక పద్మ దంపతులు వెండి శఠగోపురం సమర్పణ.





**ఆలమూరు ఆగష్టు 21(ప్రజాజ్యోతి):**ఓం శ్రీమాత్రే నమః.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామదేవత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారికి అరకేజీ వెండి శఠగోపురాన్ని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. దీని విలువ సుమారు రూ.1,25,000/–.చొప్పెల్ల గ్రామానికి చెందిన సుంకర వీర వెంకట సత్యనారాయణ–కనకలక్ష్మి దంపతుల కుమారుడు, కోడలు పోలిశ్వరావు (పోలీస్) –కనక పద్మ దంపతులు, వారి కుమార్తె స్వామ్య వర్షిణి దీప్తి,కుమారుడు వెంకట తేజ సాయి భవేష్ కలిసి ఈ వెండి శఠగోపురాన్ని అమ్మవారికి సమర్పించారు.వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారికి వెండి శఠగోపురాన్ని సమర్పించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆశీస్సులు వారి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.

## సహారా సోషల్ సర్వీస్ ఆధ్వర్యములో రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి........

రక్తదానం చేస్తున్న స్వచ్ఛంద రక్తదాతలు .......






**చాగలమర్రి ఆగస్టు 21( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావలని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌భాష, వాసవి విద్యా సమాజం కార్యదర్శి పుల్లారెడ్డి,సహరా సోషల్ సర్వీస్ అండ్ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు హుసేన్‌భిళాల్,ఉపాధ్యక్షుడు కరిముల్లా,కోశాధికారి అబ్దుల్లా పేర్కొన్నారు.శుక్రవారం శ్రీ వాసవి డిగ్రీ కళాశాల లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసారు. సుమారు 100 మంది నుండి కర్నూలు జిల్లా కేంద్రంలోని గాయత్రి ఎస్టేట్‌లోగల న్యూ లైఫ్ రక్త కేంద్రం ఇన్‌చార్జ్ పుల్లారెడ్డి,మేనేజర్ ముక్తార్‌భాష,బన్నూర్‌రెడ్డి,హరేంద్రల ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో వాసవి డిగ్రీ కళాశాల సలహాదారులు ప్రభాకర్‌రెడ్డి,ప్రిన్సిపాల్ షాబుద్దీన్,టీడీపీ పార్టీ చాగమర్రి టౌన్ కార్యదర్శి యం.ఎస్ అబ్దుల్ రజాక్ , టిడిపి నాయకులు జెట్టి నాగరాజు,టైలర్ ఖాదర్,ఫరూఖ్,రాజేష్, గఫార్ , ప్రకాష్ , స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# కొండా సురేఖకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు



**హైదరాబాద్ :** కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని నేతలు తరచూ గొప్పగా చెప్పుకుంటారు. ఇప్పుడు అదే తెలంగాణ కాంగ్రెస్‌లో చిక్కులు తెచ్చి పెడుతోంది. రెండు రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన కామెంట్స్‌తో రాజుకున్న రాజకీయ సెగ ఆమె తల్లి పదవికి అంటుకునేలా కనిపిస్తోంది. తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ లేఖ రాసినా కాంగ్రెస్ నేతలు శాంతించడం లేదు. ఆమె రాజీనామా చేసినా ఓకే లేదా అధిష్ఠానమే ఆమె తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీలో సమావేశమయ్యారు. కొండ సురేఖ కుమార్తె వ్యాఖ్యలను ఖండించారు. దీనికి పూర్తి బాధ్యత కొండా సురేఖ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకే ఆమె పదవి నుంచి తప్పుకుంటే మర్యాదగా ఉంటుందని, లేకుంటే అధిష్ఠానం బర్తరఫ్ చేయాలని నినాదిస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాత్రి పగలు కష్టపడుతుంటే పార్టీ నేతలే ఆయన్ని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి తప్పుడు కూతలు కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క సుస్మిత మాత్రమే కాదని, ఇకపై ఎవరు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానానికి, సీఎంకు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ పోరు...బీఆర్ ఎస్ కు బలం**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్రమవుతున్నాయని, నాయకుల మధ్య సవతుల పోరు నడుస్తోందని సీపీఐ సీనియర్ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతల అంతర్గత విభేదాల కారణం వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంటోందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా తప్పులు చేయకుండా నిక్కచ్చిగా వ్యవహరించినప్పుడే మంత్రులు, కిందిస్థాయి అధికారులలో భయం ఉంటుందని నారాయణ పేర్కొన్నారు. సీఎం ఇప్పటికైనా రాజకీయాలను పక్కనపెట్టి పూర్తిస్థాయిలో పాలనపైనే దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో నిషేధిత 22ఏ భూముల నిబంధనలను కొందరు అధికారులు, నాయకులు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో తమ సీపీఐ పార్టీ భాగస్వామి కాదని, గడిచిన శాసనసభ ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా తాము ఇస్తున్న సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోందని హెచ్చరించారు.

**సురేఖకు వ్యతిరేకంగా కేసు**

తెలంగాణ మంత్రి కొండా సురేఖకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో ఇప్పటికే టీపీసీసీ ముందు వివరణ ఇచ్చుకున్న ఆమెకు, తాజాగా మరో రెండు అంశాలు రాజకీయంగా తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో 'అటెంప్ట్ టు మర్డర్' (హత్యాయత్నం) కేసు నమోదైంది. మేడిపల్లికి చెందిన గొంగడి హరికృష్ణ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. తనపై సుమంత్ బృందం ఇనుప రాడ్లతో దాడికి పాల్పడిందని బాధితుడు ఫిర్యాదు చేయగా, మొదట మేడిపల్లిలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆపై కేసును జూబ్లీహిల్స్‌కు బదిలీ చేశారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 109 కింద ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, పార్టీ అంతర్గత రాజకీయాల్లో కొండా సురేఖకు వ్యతిరేకంగా అసమ్మతి గళం తీవ్రమైంది. సీఎల్పీ వేదికగా దాదాపు 20 నుంచి 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశమై ఆమె వైఖరిపై చర్చించడం సంచల నం రేపింది. కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ వివరణ ఇచ్చినా, ఆ వ్యాఖ్యలను ఆమె ఎందుకు ఖం డించలేదని సదరు ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు. అయితే, కొందరు సీనియర్ మంత్రులు, సీనియర్ నాయకులు సురేఖకు మద్దతుగా నిలుస్తుండటంతో కాంగ్రెస్ వర్గపోరు పీక్స్‌కు చేరింది.

**చర్యలు తప్పవు**

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పర్యటన నుంచే ముఖ్య నేతలకు ఆయన గట్టి హెచ్చరికలు పంపినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పరకాలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తద్వారా రేవూరి అభ్యర్థిత్వాన్ని దాదాపు ఖరారు చేస్తూ స్పష్టమైన సంకేతాలిచ్చారు. అయితే, ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేసేలా.. ఆ మరుసటి రోజే మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ పరకాల నియోజకవర్గంలో సభ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా, వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. సీఎం పర్యటనకు స్థానిక మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరు కావడం, ఆ వెంటనే ఆమె కుమార్తె ఈ వ్యాఖ్యలు చేయడం ఒక ప్రణాళిక ప్రకారమే జరిగిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ పరిణామాలపై బుధవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్.. అక్కడే కొందరు ముఖ్య నేతల వద్ద తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మరికొందరు సీనియర్ మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి, ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు చెప్పారని సమాచారం. సీఎం ఆదేశాల మేరకు పీసీసీ క్రమశిక్షణా కమిటీ వెంటనే రంగంలోకి దిగింది. మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని కోరింది. అయితే, "కుమార్తె చేసిన వ్యాఖ్యలకు నేనెలా బాధ్యురాలిని అవుతాను?" అని మంత్రి సురేఖ గురువారం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. "సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించుకోవడం సరికాదు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. మంత్రి సురేఖ వివరణను పరిశీలించాక తదుపరి చర్యలపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది" అని స్పష్టం చేశారు.

**నా టార్గెట్ రేవంత్ రెడ్డే**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు

# ఎంపి ఈటల పర్యటన



కొల్తూరు గ్రామంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటించారు. పారిశ్రామిక కంపెనీల వ్యర్థాలతో కలుషితమైన నీటితో కుంటలు మరియు చెరువులు కాలుష్య కూపంగా మారి అందులో ఉన్న చేపలు మరియు నీటి తాగనీకి వచ్చే పశు సంపద ఇతర వన్యప్రాణులు మృతి చెందుతున్నాయని తెలియడంతో చెరువు దగ్గరికి వెళ్ళి స్వయంగా పరిశీలించిస్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లోకి రాకుండా కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు కూడా ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకొని కలుషిత నీళ్ళు బయటికి రాకుండా చూసుకోవలసిన బాధ్యత వారి మీద ఉందని లేదంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఈటల రాజేందర్ మాట్లాడుతూ జీడిమెట్ల కెమికల్ ఇండస్ట్రీ ఏరియా, జీనోమ్ వాలీ, తుర్కపల్లి, జవహర్ నగర్ డంప్ యార్డు నుంచి వచ్చిన మురుగునీరు, వాసన వల్ల ఈ ప్రాంత ప్రజల జీవనం దుర్భరంగా మారింది. – వీచే గాలి విషం అయ్యింది.– చర్మం దద్దుర్లు, ఊపిరితిత్తుల వ్యాధులు, అబార్షన్లు, క్యాన్సర్, పశువులు ప్రెగ్నెంట్ అవ్వడం లేదు.– ఒక్కమాటలో చెప్పాలంటే వీరు నరకంలో బ్రతుకుతున్నారు.– ఇవి మురికి కూపాలు కావు, ప్రాణాలు తీస్తున్న నరక కూపాలుగా మారాయి. – ఇంత టెక్నాలజీ వచ్చినా, నిబంధనలు వచ్చినా రసాయన వ్యర్థాలను అరికట్టలేక పోతున్నారు. – ప్రతి పరిశ్రమలో ట్రీట్మెంట్ ప్లాంట్ పెట్టాలి కానీ కొద్దిమంది ఫార్మా కంపెనీల యాజమాన్యాలు బోర్లు వేసి ఆ రసాయన వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నారు. డ్రైనేజీలలో వదిలి పెడుతున్నారు. – దీనివల్ల చెరువుల్లో ఉన్న చేపలు, వాటిని తిన్న కొంగలు, పక్షులు చనిపోతున్నాయి. నీళ్లు తాగి పశువులు చనిపోతున్నాయి.– కొల్తూరు గ్రామంలో జీనోమ్ వ్యాలీ నుండి వచ్చిన రసాయన వ్యర్థాల వల్ల దాదాపు 15 లక్షల రూపాయల విలువైన చేపపిల్లలు చనిపోయాయి. ఈ చేపలు పెరిగితే కోటి రూపాయల సంపద. 250 కుటుంబాలు ఈ చేపల మీద ఆధారపడి ఉన్నాయి. కళ్ళముందే చనిపోతుంటే వీరు విలవిలలాడుతున్నారు. – ఫార్మాకంపెనీల వల్ల మాకు ఉపాధి దొరుకుతుంది అనుకున్నాం, కానీ వీటివల్ల మా ప్రాణాలే పోతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.– కిడ్నీ డయాలసిస్, అబార్షన్ వల్ల ఈ ఊరు వాళ్ళు ఇబ్బంది పడుతున్నారు. – సంపాదన అంతా ఆసుపత్రులకే అవుతుంది. – పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళ్లు పెద్ద కంపెనీ వారు ఇచ్చే డబ్బులకు మరిగి పేదలు చచ్చిపోతున్న పట్టించుకోవడం లేదు.– ఈ ప్రాంత ఎంపీ గా అవసరం అయితే డిల్లీ వరకు కంప్లైంట్ చేస్తాం..– దీనికి శాశ్వత పరిష్కారం అందించేవిధంగా చర్యలు తీసుకుంటాము.

# కరీంనగర్ శిశుమందిర్ లో వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతం



**కరీంనగర్** శ్రావణ శుక్రవారం సందర్భంగా కరీంనగర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ హై స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆచార్యులు, మాతృమూర్తులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు మరియు భక్తి వాతావరణం నడుమ వరలక్ష్మి అమ్మవారికి వేద బ్రాహ్మణులు అభిషేక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబాల సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, పిల్లల విద్యాభివృద్ధి మరియు సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిలో స్త్రీని కేవలం కుటుంబ సభ్యురాలిగా కాకుండా మాతృశక్తిగా, ఆదిశక్తిగా, దైవస్వరూపంగా గౌరవించే ఉన్నతమైన సంప్రదాయం ఉందని తెలిపారు. ఈ విలువలను బాల్యంలోనే పిల్లలలో పెంపొందించడం ద్వారా మహిళల పట్ల గౌరవం, కుటుంబ విలువలు మరియు సామాజిక బాధ్యతను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ఖీూా జన్మ శతాబ్ది స్ఫూర్తితో నిర్వహిస్తున్న "సప్తశక్తి సంగమం" కార్యక్రమాల ద్వారా నారీశక్తి చైతన్యం, మాతృశక్తి గౌరవం మరియు భారతీయ సంస్కృతి విలువలను సమాజంలో మరింత బలంగా చాటే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. స్త్రీలోని వివిధ శక్తి స్వరూపాలను గుర్తించి, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రేరణ కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొడ్ల శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమం భక్తి, సంస్కృతి, మాతృశక్తి మరియు విద్యా విలువల సమన్వయానికి ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో అడ్వకేట్ బొడ్ల గీతారాణి, కమిటీ సభ్యురాలు అప్పిడి వకుళా దేవి, ఊత్కురు రజనీ శ్రీనివాస్, కార్యదర్శులు ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గీకురు కృష్ణవేణి, ఆచార్య, మాతాజీ బృందం, విద్యార్థులు మరియు పేరెంట్స్ పాల్గొన్నారు.

## వర్షం కోసం ఈద్గాలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



**నందవరం, ఆగస్ట్ 21 (ప్రజాజ్యోతి):** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ నాగలదిన్నె గ్రామంలోని ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామ ప్రజల కష్టాలు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ ముస్లింలు సామూహికంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో సుభిక్షం నెలకొనాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా జబ్బార్, ఇస్మాయిల్, షబ్బీర్, సేఫి, మునాఫ్, ఫరూక్, నబి, మాబాషా తదితరులతో పాటు పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు. వర్షం కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక ప్రార్థనలో గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## గిరిజనేతర నిర్వాసితుల ఓటీఎస్ దరఖాస్తుల గడువు పొడిగింపు

**ఆగస్టు 22 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్**




**కూనవరం , ఆగస్టు 21:** ప్రజా జ్యోతి పోలవరం ప్రాజెక్టు ఫేజ్--1బి పరిధిలో చింతూరు డివిజన్‌లోని వీఆర్‌పురం, కూనవరం, చింతూరు మండలాలకు చెందిన మొత్తం 30 ముంపు గ్రామాల్లో 1వ, 2వ డ్రాఫ్ట్ స్కీమ్‌లలో పేర్లు ఉన్న గిరిజనేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుం బాల కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) దరఖాస్తుల సమర్పణ గడువు ను ఈ నెల 22వ తేదీ వరకు పొడిగించి నట్లు చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ తెలిపారు. ఇప్పటివరకు ఓటీఎస్ దరఖాస్తులు సమర్పించని అర్హులై న నాన్--ఎస్టీ పీడీఎఫ్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆగస్టు 22వ తేదీలోపు తమ దరఖాస్తులను చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. 1వ, 2వ డ్రాఫ్ట్ స్కీమ్‌లలో పేర్లు ఉన్న సంబంధిత నాన్--ఎస్టీ పీడీఎఫ్‌లు మాత్రమే ఓటీఎస్ దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఓటీఎస్ దరఖాస్తులు సమర్పించిన పీడీఎఫ్‌లు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన నాన్--ఎస్టీ పీడీఎఫ్‌లు గడువు పొడిగింపును సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని పీవో శుభం నొక్వాల్ కోరారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**అన్నిదానాల్లో అన్నదానం మిన్నఅధ్యక్షులు లయన్ యస్.అంజిరెడ్డి**

**అన్నదాత సుఖీభవడిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్**



**రామాపురం ఆగస్టు 21 ప్రజా జ్యోతి** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణం కొత్తపేట ముస్తఫా మస్జిద్ వాస్తవ్యులు షేక్ ఇర్షాద్ అహమ్మద్ గారి కుమారుడు షేక్ ఇలియాజ్ పుట్టిన రోజు సందర్భంగా ప్రేమలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు లయన్ యస్. అంజిరెడ్డి తెలిపారు. అనంతరం దాత షేక్ ఇర్షాద్ మాట్లాడుతూ రోజు నా కుమారుడు షేక్ ఇలియాజ్ పుట్టిన రోజు సందర్భంగా నా వంతుగా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్,కోశాధికారి లయన్ కె.శ్రీనివాసులు(భూపతి),ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య ,దేవనాథ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం



**దువ్వూరు,ఆగస్టు21( ప్రజా జ్యోతి )** దువ్వూరు మండల కేంద్రంలో వెలసిన శ్రీ మరకత వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం,మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి పూజ వ్రతం చేశారు. అమ్మవారి శాల ప్రధాన అర్చకులు మూర్తి స్వామి ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళల చే కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆర్యవైశ్య సంఘ పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

# చిత్ర పరిశ్రమలో విషాదం..
# దిగ్గజ నటి ‘షావుకారు జానకి’ కన్నుమూత!



భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసిన అలనాటి ప్రముఖ సీనియర్ నటి ‘షావుకారు’ జానకి (94) తుదిశ్వాస విడిచారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రిలో డిసెంబర్ 12, 1931న జన్మించిన శంకరమంచి జానకి (అసలు పేరు) రంగస్థల నటిగా తన కళా జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత రేడియో నాటికల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, 1950లో ఎన్టీఆర్ సరసన విడుదలైన సరికొత్త సంచలన చిత్రం ‘షావుకారు’ ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. ఆ మొదటి చిత్రంతోనే ఆమె నటనకు ప్రేక్షకులు ఫిదా కావడంతో, ఆ సినిమా పేరే ఆమె ఇంటి పేరుగా మారిపోయింది. దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె అసాధారణ సినీ ప్రయాణంలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సుమారు 400లకు పైగా చిత్రాల్లో నటించి రికార్డు సృష్టించారు. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక ‘పద్మశ్రీ’ అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# మగబిడ్డ పుట్టాడు..
# ‘కేరింత’ హీరోయిన్ పోస్ట్ వైరల్

తెలుగులో ‘కేరింత’ అనే సినిమాలో హీరోయిన్‌గా చేసిన సుకృతి తల్లయింది. మగబిడ్డకు జన్మనిచ్చిన విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ మేరకు ఓ ఫొటోని కూడా పోస్ట్ చేసింది. ఈ క్రమంలోనే పలువురు నెటిజన్లు ఈమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఢిల్లీకి చెందిన సుకృతి అంబటి.. చదువుకుంటున్న టైంలో డ్యాన్స్, యాక్టింగ్‌లోనూ ఆసక్తి చూపించేది. అలా దిల్ రాజు నిర్మించిన ‘కేరింత’లో భావన పాత్ర కోసం ఎంపికైంది. ఈ మూవీ హిట్ అయినా సరే అవకాశాలు రాలేదో ఆసక్తి లేదో తెలియదు గానీ మరో మూవీ చేయలేదు. యాక్టింగ్ కెరీర్ పక్కనబెట్టేసింది. ఇక నాలుగేళ్ల క్రితం అక్షయ్ సింగ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. గత కొన్నాళ్లుగా ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తూ వచ్చిన సుకృతి.. ఈ ఏడాది ఏప్రిల్‌లో తను ప్రెగ్నెన్సీతో ఉన్న సంగతి బయటపెట్టింది. ఇప్పుడు తనకు మగబిడ్డ పుట్టాడని చెప్పుకొచ్చింది.



## బాలీవుడ్ ఎంట్రీపై భాగ్యశ్రీ బోర్సేకు షాక్..
## ఆ వార్తల్లో నిజం లేదంటూ క్లారిటీ!

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. ‘మర్జావాన్’, ‘ఏక్ దివానే కీ దివానియత్’ వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. ‘యారియాన్ 2’, ‘చందు ఛాంపియన్’ వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన ‘మిస్టర్ బచ్చన్’ సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది.






# బాక్సాఫీస్ వద్ద ‘డీసీ’ జోరు..
# రూ.100 కోట్ల క్లబ్‌లోకి
# లోకేష్ కనగరాజ్ సినిమా!

టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన ‘డీసీ’ (ఐజ) సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల ‘దేవదాస్’ స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,